TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
మంగళవారం, అక్టోబర్ 13, 2026 | సంపుటి - 21 | సంచిక 04 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

అధునాతన ఏఐపై 'ఎమర్జెన్సీ బ్రేక్' అవసరం



మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల

న్యూఢిల్లీ : శక్తివంతమైన కృత్రిమ మేధస్సు(ఏఐ) మాడళ్లను సంభావ్య అంతర్గత భద్రతా ముప్పుగా కంపెనీలు పరిగణించాలని, అవి రాజీకి గురై ఉండవచ్చని ముందుగానే భావించాలని, అలాగే ఏజెంటిక్ ఏఐ మాడళ్లు నియంత్రణ తప్పి ప్రవర్తించకుండా నిరోధించేందుకు ఒక 'ఎమర్జెన్సీ బ్రేక్' వ్యవస్థను ఏర్పాటు చేయాలని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్టులో 'దీనిని ఎమర్జెన్సీ బ్రేక్‌లా భావిం చండి. ఒక అధీకృత వ్యక్తి, ఒక మోడల్ 2లో

పెట్టుబడిదారులకు అండగా
కూటమి ప్రభుత్వం

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ : 16 ఎంఓయూల ద్వారా రూ.4,652 కోట్లు పెట్టుబడులు, రూ.2,090 కోట్లతో పూర్తయిన 4 ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం శుభసూచకమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్గధామంగా మారుస్తోందని అన్నారు. సోమవారం కాకినాడలో జరిగిన ప్రాం తీయ పెట్టుబడుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 2లో

ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి : ప్రజలు ఇచ్చే ఫిర్యాదు లను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం రాజధాని అమరావతిలోని ఆర్టీజీ ఎస్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అధికారులను ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమ స్యలను వీలైనంత మేరకు పరిష్కరించ గలుగుతు న్నామని అన్నారు. వేగంగా, సమర్థ వంతంగా అమలు చేసేం దుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహిం చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబు దారీతనం ఉండేలా చూడాలని సూచించారు. అయితే వివిధ శాఖలపై కొందరు 2లో

ఎన్నికల్లో ఓటమి భయంతోనే
'సర్' అమలు

జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి
దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోంది..
ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు
మోదీ సర్కారుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రలో సర్ (ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ఎక్కడ తీసేశారో అక్కడ బీజేపీ గెలుస్తోందని ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. మనుగడ లేని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుస్తున్నాయని వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. సీఈసీ ఎంపికలో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిని తొలగి ంచారని ప్రస్తావించారు. ఈరోజు (సోమవారం) ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 2014లో 81 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇప్పుడు ఉన్న జనాభా ఎంత అని ప్రశ్నించారు. జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..? అని నిలదీశారు. ఈ విషయంలో ఎవరు సమాధానం చెబుతారని అడిగారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు కూడా మోదీకి ఈ విషయం గురించి ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ రెండు వర్గాలను తయారు చేస్తోందని.. అనుకూలం ఉన్న వారికి తరువాయి 2లో

ఫసల్ బీమా అమలు
చేయాల్సిందే

రేవంత్ సర్కార్‌కు రాంచందర్ హెచ్చరిక

హైదరాబాద్ : 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు చూశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రోడ్లు, రైల్వే, ఎయిర్ వేస్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. 41 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నా అని.. ఓట్ డిలీట్ అయిన వాళ్లలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఒసామా బిన్ లాడెన్ వారసులు కాంగ్రెస్ పార్టీ నేతలు అంటూ రాంచందర్ రావు విరుచుకుపడ్డారు. దేవుళ్లను ఎగతాళి చేయొద్దని.. హిందువులు ఆగ్రహంతో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రైతులు చనిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనులకు పోతారా అంటూ ఫైర్ అయ్యారు. తరువాయి 2లో

ఎస్ఐఆర్‌లో అక్రమాలు, ఓటర్ల తొలగింపు

సుప్రీంకోర్టులో రాహుల్ పిటిషన్

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెద్దఎత్తున ఓటర్ల పేర్ల తొలగింపు, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలు సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్, ఎన్‌సీపీ(ఎస్‌పీ) నేత సుప్రియా సూలే, శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం ఎంపీ మహువా మాఝీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, ఐయూఎంఎల్ నేత ఈడీ మహమ్మద్ బషీర్ తదితరులు కూడా పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం 2లో

మోదీ ప్రభుత్వం
ఓటు చోరీ చేస్తోంది

అర్హులైన ఓటర్లను సీఈసీ తొలగించింది: మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజం
దొంగదారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది: మంత్రి శ్రీహరి
సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు ఆందోళన చేస్తాం: మహేశ్ గౌడ్
ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు: ఎంపీ చామల

ఢిల్లీ : సర్(ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఢిల్లీలో నిరసనకు దిగారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్' ఉపయోగించుకొని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని.. అర్హులైన ఓటర్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని ఫైర్ అయ్యారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. 2లో

సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్
యాక్షన్ ప్లాన్ ఏంటి

మీడియాతో హరీశ్‌రావు

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు. రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుం టున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని 2లో

అధునాతన ఏఐపై 'ఎమర్జెన్సీ బ్రేక్' అవసరం

పని మధ్యలో ఉన్నప్పటికీ, దానిని ఎప్పుడైనా పాజ్ చేయగలగాలి లేదా పూర్తిగా ఆపివేయగలగాలి' అని నాదెళ్ల అన్నారు. ఇటీవలి నెలల్లో ఆంత్రోపిక్ పీబీసీ, ఓపెన్ ఏఐ ఇంక్. సంస్థలు తమ ఏఐ మోడళ్లు అనుకోనివిధంగా ప్రవర్తించిన పలు ఘటనలను వెల్లడించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఆంత్రోపిక్‌కు చెందిన ఒక మోడల్ హత్య కేసులో పోలీసులకు తప్పుడు సమాచారాన్ని అందించడం నుంచి, మూడోపక్షానికి చెందిన పలు వెబ్‌సైట్లపై హ్యాకింగ్ వరకు పలు ఘటనలు అత్యాధునిక ఏఐ వల్ల ఎదురయ్యే భద్రతా ప్రమాదాలపై ఆందోళనలు పెంచాయి. 'ఏఐ కిల్ స్విచ్'గా పిలువబడే వ్యవస్థపై చర్చను మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి. అత్యాధునిక మోడళ్ల అభివృద్ధిపై పరిమితులు విధించే మార్గదర్శక సూత్రాలను మైక్రోసాఫ్ట్ ఏఐ పరిశోధకులు సెప్టెంబర్ 14న విడుదల చేశారు. ఫ్రాంటియర్ మోడళ్ల అభివృద్ధిని నెమ్మదించి, భద్రతపై దృష్టి పెట్టాలని పరిశ్రమ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. మైక్రోసాఫ్ట్ ఏఐ మోడళ్లను ఉపయోగిస్తూ, కార్పొరేట్ కస్టమర్లకు ఏఐ వాటిని సరఫరా చేస్తున్నది.

సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి

మాజీ మంత్రి మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు. పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.

ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

దుష్ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారని వివరించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోలపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పెట్టుబడిదారులకు అండగా కూటమి ప్రభుత్వం

పెట్టుబడులకు, ప్రగతికి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్గధామమని అభివర్ణించారు. పెట్టుబడిదారులు రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేస్తారనేది తమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జాతి కోసం, దేశం కోసం పారిశ్రామికవేత్తలు ఆలోచించాలని స్పష్టం చేశారు. సింగపూర్ తరహాలో సమష్టి శ్రమతో విజయం సాధ్యమని అన్నారు. ఐక్యంగా ఆంధ్రప్రదేశ్ పురోగతిలో భాగస్వాములం అవుదామని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. పరిశ్రమలు మొదటి రోజు నుంచే పర్యావరణం మీద దృష్టిపెట్టాలని సూచించారు. అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో మీరు పరిశ్రమ పెడితే.. మాకేమిస్తారు..? అని అడిగే విష సంస్కృతి అప్పట్లో ఉండేదని చెప్పారు. కానీ మీరు పెట్టుబడులు పెడితే రాష్ట్రానికి ఏం ఇస్తారు..? ప్రజలకు ఏం చేస్తారని అడిగి సత్సంప్రదాయంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

మొక్కల వెంకటయ్యకు సత్కారం

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 12 : మొక్కల వెంకటయ్యకు భద్రాద్రి కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా సన్మానం చేశారు. కొత్తగూడెం పరిధి రామవరంలో ఉంటున్న రావి వెంకటయ్య రికార్డు స్థాయిలో మొక్కలు నాటినందుకు గాను ఆయనను ఇటీవల రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రులు పలువురు సన్మానం చేశారు. సన్మానం అందుకున్న వెంకటయ్య సోమవారం కలెక్టరేట్ కు రావడంతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ ఓ పద్మావతి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత, వృద్ధుల శాఖ అధికారి వరప్రసాద్ చేతుల మీదుగా వెంకటయ్యను శాలువాతో సన్మానించి షీల్డ్ లను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కోటి మొక్కలు పెంపకమే లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇప్పటి వరకు 85 లక్షల 15 మొక్కలు నాటినట్లు తెలిపారు. తనకు అవకాశం ఉన్నంత వరకు మొక్కలు నాటుతానని ఆయన తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల : ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూజిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 49 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓ లు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఓటమి భయంతోనే 'సర్' అమలు

ఓట్లు, ఇతరులను ఓట్లులేని వారిగా తయారు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని పౌరులను మోదీ సర్కార్ రెండు రకాలుగా విడగొడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో శాశ్వత పథకాలను బీజేపీ తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సీఈసీపై మరో స్వతంత్ర పోరాటం జరుగుతోందని వెల్లడించారు. జ్ఞానేశ్ గో బ్యాక్ పేరుతో తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సర్ వ్యతిరేక పోరాటం, మరో స్వతంత్ర పోరాటమేనని.. సైమన్ గో బ్యాక్ పోరాటం లాగే తాము పోరాటం చేస్తామని అన్నారు. ఇన్నాళ్లు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవదనే అభిప్రాయంతో 'సర్'ను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమకు ఓటు వేయని వారి ఓట్లను 'సర్' పేరుతో తొలగిస్తున్నారని ఆగ్రహించారు. ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యువత ఓట్లను కూడా తొలగిస్తున్నారని ఫైర్ అయ్యారు. మోదీ ఎందుకు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లను తొలగించి పశ్చిమబెంగాల్, బీహార్, హరియానాలో గెలిచారని ధ్వజమెత్తారు. ఓటు లేకపోతే ఏ పార్టీ పేదలను పట్టించుకోదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మోదీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోంది

సర్‌ను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారని వ్యాఖ్యానించారు. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆగ్రహించారు. ఎన్నికల కార్యాలయం పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే, పిలుపుతో ప్రజాస్వామ్య గొంతును వినిపించేందుకు తాము ఢిల్లీ వచ్చామని తెలిపారు. కేంద్రం, సీఈసీపై తమ నిరసన తెలియజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యుడి ఓటు హక్కును కాపాడేలా తాము పోరాటం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపుమేరకు తాము ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు. 'సర్' ద్వారా ఓట్లు తొలగించి.. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అన్ని చోరీలు అయిపోయాయని.. ఇప్పుడు ఓట్ల చోరీ చేస్తోందని ఆగ్రహించారు. దొంగ దారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తాము ఆందోళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మోదీ, అమిత్ షా 'సర్'ను వాడుకొని ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. అధికారంలో ఎప్పటికీ ఉండాలనే ఆకాంక్షతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఇంత పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నా.. వారు కనీసం స్పందించట్లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు అందరూ ఢిల్లీకి వచ్చి పోరాటం చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు అని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ బీజేపీకి వత్తాసు పలుకుతూ అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. బీజేపీ కార్యకర్తలను ఎన్నికల కమిషనర్లుగా తీసుకువచ్చి కేంద్ర ఎన్నికల సంఘంలో కూర్చోబెట్టారని మండిపడ్డారు. 50 ఏళ్లు అధికారంలో ఉండాలనే పిచ్చి ఆలోచనతో బీజేపీ ఇలాంటి పనులు చేసిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.

పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి టీమ్స్

కొవ్వూరు : తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. దేవరపల్లి సమీపంలోని క్వారీ వద్ద పెద్దపులి తిష్ట వేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ క్వారీ వద్దే సేదతీరుతున్న పులిని ఎలాగైనా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులిని బంధించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు.పులికి ఎలాంటి హాని కలగకుండా, అలాగే సిబ్బందికి ప్రమాదం జరగకుండా దాన్ని బంధించేందుకు అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కొవ్వూరు ప్రాంతంలో పులి సంచారం దృష్ట్యా స్థానిక ప్రజలు, సమీప గ్రామాల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.గోదావరి జిల్లాలో పెద్దపులి దోబూచులాడుతోంది. చాలా రోజులుగా అటవీ శాఖను ముప్పుతిప్పలు పెడుతున్న పులి.. ఇప్పుడు చాగల్లు అటవీప్రాంతంలో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా పాపికొండల అభయారణ్యంలో తిరిగిన పులి కొన్ని రోజుల కిందట సీతానగరం వద్ద గోదావరి నదిని దాటింది. దేవరపల్లి మీదుగా ఇప్పుడు డెల్టా ప్రాంతానికి వచ్చేయడంతో అటవీ అధికారుల్లో ఆందోళన పెరిగింది. పులిని సాధ్యమైనంత త్వరగా బంధించేందుకు పూణే నుంచి ప్రత్యేక టీమ్‌ను రప్పించారు.ఈ క్రమంలో శనివారం ఉదయం పులి చాగల్లు సమీపంలోని ఓ అరటితోటలో రైతులకు కనిపించింది. ఆ తర్వాత ఓ పొక్లెయిన్ సమీపంలో పులి సేదతీరుతున్నట్లు కెమెరాలకు చిక్కింది. పులి అనుసరిస్తున్న వ్యూహం అటవీశాఖ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట కోకో తోటలు, వరి పొలాల్లో నక్కుతూ, చీకటి పడగానే ఊర్లు మారుతూ హడలెత్తిస్తోంది. పులి కదలికలను అటవీ శాఖ అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని.. రేడియో కాలర్ సిగ్నల్స్, ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా దాని జాడను ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం కూడా పులిని బంధించే ఆపరేషన్‌లోకి దిగింది. పూణే టీమ్ మాత్రం సాధ్యమైనంత త్వరగా పులిని పట్టుకుంటామని చెప్పి ఒకరోజు పూర్తయిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

రాహుల్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ :లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి సమర్థించుకోవద్దు. మారండి. మీరు ప్రధాని నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్న సాంకేతిక కేసుల విషయమై.. ఇప్పటికే మంగళవారం సుప్రీంకోర్టులో సాంకేతిక ప్రక్రియకు సంబంధించిన కేసులతో పాటు, ప్రతిపక్ష సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌లు విచారణకు రానున్నాయని సీజేఐ కార్యాలయం రాహుల్ గాంధీకి తెలిపింది. ఇతర ఎన్నికల కమిషనర్ల అంగీకారం లేకుండా తీసుకున్నారని.. అలాగే సీఈసీ వివిధ నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా ఇప్పటికే సీజేఐ ధర్మాసనం విచారిస్తోంది. ఈ రోజు ఉదయం, ప్రతిపక్ష పార్టీలు సుప్రీంకోర్టుకు పాదయాత్ర చేసి, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ సీజేఐకి ఒక వినతిపత్రాన్ని సమర్పిస్తాయని రాహుల్ గాంధీ ప్రకటించారు. తాజాగా సీజేఐ సాంకేతి , సీఈసీ అంశాలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ కి అపాయింట్ నిరాకరించడంతో సోమవారం జరిగే సుప్రీంకోర్టు మార్చ్ పై ఉత్కంఠ నెలకొంది.

సింహాసనం ఖాళీ చేయండి.. ప్రజలు వస్తున్నారు'..

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కూడా ఆ స్వరాన్ని వినిపించారు. ప్రముఖ హిందీ కవి రామ్‌ధారీ సింగ్ దినకర్ రచించిన 'జనతంత్ర్ కీ జన్మ్' కవితలోని ప్రసిద్ధ పంక్తులను సోమవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'సింహాసన్ ఖాళీ కరో కి జనతా ఆతీ హై' అంటూ ప్రజల శక్తిని గుర్తుచేస్తే వ్యాఖ్యను పోస్ట్ చేశారు. మరో పోస్టులో రాహుల్ గాంధీ చేసిన 'ఈ ప్రభుత్వం దిగిపోతుంది' అనే వ్యాఖ్యను పంచుకున్నారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ అక్టోబర్ 10న జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు హింసకు పాల్పడ్డారని, బీజేపీ కార్యకర్తలు విద్యార్థులు, మహిళలపై దాడులు చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనలను నిరసిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. గత వారం రోజులుగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నిరసనలు కొనసాగిస్తోంది.ఇటీవలి నిరసనల్లో శశి థరూర్ చురుగ్గా పాల్గొనకపోవడం గమనార్హం. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వైఖరికి కొన్ని అంశాల్లో ఆయన మద్దతు పలికారు. ముఖ్యంగా 2025 మేలో భారత్–పాకిస్థాన్ మధ్య నాలుగు రోజుల పాటు సాగిన సైనిక ఘర్షణకు సంబంధించిన 'ఆపరేషన్ సిందూర్' విషయంలో ప్రభుత్వ వైఖరిని సమర్థించారు. అలాంటి థరూర్ ఇప్పుడు ప్రతిపక్షాల నిరసనలకు మద్దతుగా పరోక్షంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎల్లమ్మ చెరువు బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హుస్నాబాద్ : హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై చేపడుతున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి పరిశీలించారు.హుస్నాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువు కట్ట పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు, బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పండుగ సందర్భంగా ప్రజల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ ఉండవలసిన ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, తాసిల్దార్ లక్ష్మారెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా అమలు చేయాల్సిందే

తెలంగాణ ప్రజలు, రైతుల మీద ఉన్న ప్రేమ ఇదేనా రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని, ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన అమలు చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాక్రోచ్.. పిక్రోచ్ కలిసి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశ్నించారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వమన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు రాహుల్‌ను అడ్డుకుంటామని తెలిపారు. గోవాలో కాదు తెలంగాణలో డ్రగ్స్ పెరిగిపోతోందని.. నషా ముక్త్ భారత్ అనేది తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని చెప్పుకొచ్చారు. జ్ఞానేశ్ కుమార్‌తో బీజేపీకి ఏం సంబంధమని నిలదీశారు. నిరసనకారులపై ఎలాంటి దాడులు జరగలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్.. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ఎక్కడా గెలవదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని కొత్తగా లాంచ్ చేయాలని చూస్తున్నారు కానీ ల్యాండ్ కావడం లేదంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ రద్దు చేసి మరీ.. స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం ఏముందని సీఎం సహా మంత్రులపై రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్‌లో అక్రమాలు, ఓటర్ల తొలగింపు

సోమవారం సాయంత్రం ఈ పిటిషన్ దాఖలైంది. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో రాహుల్ సారథ్యంలో విపక్ష ఎంపీలు, నేతలు సుప్రీంకోర్టు వరకూ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి పోలీసులు నిలువరించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో సుప్రీంకోర్టుకు రాలేకపోయారు. దాంతో ఆయన తరఫున న్యాయబృందమే అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. తొలుత ఓట్ల చోరీ ఆరోపణలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆయనకు లేఖ రాసినప్పటికీ వారి అభ్యర్థనను సీజేఐ తోసిపుచ్చారు. ఇదే అంశానికి సంబంధించిన కేసులు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున సమావేశం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. పలు పిటిషన్లపై మంగళవారం విచారణ చేపట్టనున్నందున అంతగా అనుకుంటే సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయవచ్చని వారికి సూచించారు.

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ బృందం కరపత్రాల పంపిణీ ప్రచారం.

గోదావరిఖని : రామగుండం అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఈరోజు ఆర్జి 1 ఏరియాలోని ఉజాం-11c మైన్, ఓసీపీ-5 ప్రాజెక్టు, ఏరియా వర్క్ షాప్, సింగరేణి ఏరియా హాస్పిటల్, మరియు మిగతా బొగ్గు గనుల వద్ద ఈరోజు ఉదయం ఎమ్మెల్యే బృందం కరపత్రాలను పంపిణీ చేసింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు జరిగిన అన్యాయం, కార్మికుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను కరపత్రాల ద్వారా కార్మికులకు వివరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థకు సంబంధించిన నిధుల వినియోగం, కార్మికుల ఆదాయపు పన్ను మినహాయింపు, సొంత ఇంటి పథకం, లాభాల వాటా చెల్లింపులు, మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో కార్మికులకు ఎదురైన సమస్యలను కరపత్రాల్లో ప్రస్తావించారు.అదేవిధంగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న అంశాలను వివరించారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు, ఆదాయపు పన్ను మినహాయింపు, లాభాల వాటా చెల్లింపులు, వారసత్వ ఉద్యోగాల వంటి కీలక అంశాల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాలను తెలియజేశారు.సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, సంస్థ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారి నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని బృందం సభ్యులు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలోరామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ టీం సభ్యులు జనగామ శ్రీనివాస్ గౌడ్, అరగంటి కృష్ణ, భాస్కర్ కిరణ్, పాకాల సాయికుమార్, బద్రి శంకర్, ఎల్.అంజనేయులు,గోషికె కనకయ్య, మండల రమేష్, దార సునీల, రవికుమార్,కుమారస్వామి సంపత్,మామిడి శ్రీనివాస్ లతో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

ఓఎల్ఎక్స్ వేదికగా మొబైల్ మోసాలు నిందితుడి అరెస్ట్

రాయదుర్గం హైదరాబాద్ : ఓఎల్ఎక్స్ వేదికగా ఖరీదైన సెల్‌ఫోన్లను తక్కువ ధరకు విక్రయిస్తామంటూ అమాయకులను మోసగిస్తున్న అంతర్రాష్ట్ర కేటుగాడిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని హన్మకొండకు చెందిన బత్తుల శ్రీరామ్ (31)గా గుర్తించారు. ?పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు గూగుల్ నుంచి ఖరీదైన స్మార్ట్‌ఫోన్ల ఫోటోలను డౌన్‌లోడ్ చేసి, వాటిని తక్కువ ధరకే విక్రయిస్తామంటూ ఓఎల్ఎక్స్‌లో నకిలీ ప్రకటనలు ఇచ్చేవాడు. ఆ ప్రకటనలు చూసి సంప్రదించిన కొనుగోలుదారుల నుంచి ఇతరుల యూపీఐ (ఐఖఐ) ఐడీలు, బ్యాంక్ ఖాతాల ద్వారా ముందస్తుగా నగదు వసూలు చేసేవాడు. డబ్బులు చేతికి అందగానే తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యేవాడు. ఇలా ఇప్పటివరకు బాధితుల నుంచి సుమారు రూ.12.80 లక్షలు కాజేసినట్లు గుర్తించారు.

భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూ సమస్యను పరిశీలించిన బండి రమేష్.

కూకట్ పల్లి అక్టోబర్ 12 (ది క్రైమ్ న్యూస్) : గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007 లోని భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ సమస్యకు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు సంబంధించిన అంశాల పై నాయకులతో చర్చించి, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి రమేష్ తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోక్ సాంగ్ ప్రోమో విడుదల చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు.

కూకట్ పల్లి అక్టోబర్ 12 (ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ ప్రైవేట్ సాంగ్ ఆల్బమ్ "నా రంగరాజు బంగారు బావ" ప్రోమో ఆల్బమ్ ను నిర్మాతలు శ్రీనివాస్ మహారాజ్, రేవంత్ మహారాజ్‌ల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు సోమవారం వారి సమక్షంలో విడుదల చేశారు. ఈ పాటను విగ్నేష్ ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఆల్బమ్ రూపకల్పన కోసం కృషి చేసిన నిర్మాతలు, కళాకారుల శ్రమకు తగిన గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. యువత తమలోని ప్రతిభను గుర్తించి, సంగీతం, సినిమా, డిజిటల్ మీడియా వంటి వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుంటూ తమలోని ప్రతిభతో ఎదగడమే కాకుండా, సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, "నా రంగరాజు బంగారు బావ" పాటను ప్రేక్షకులందరూ వీక్షించి, లైక్ చేసి, విగ్నేష్ ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకుని, తమ ఆదరణను అందించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని, మరిన్ని మంచి పాటలు, సృజనాత్మక కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అనంతరం ఆల్బమ్ నిర్మాతలు శ్రీనివాస్ మహారాజ్, రేవంత్ మహారాజ్‌లకు ఈ ఆల్బమ్ మంచి విజయం సాధించి, ప్రేక్షకుల ఆదరణ పొందాలని, భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన కార్యక్రమాలు చేపట్టాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

అంకితభావానికి గుర్తింపుగా హోంగార్డు వెంకటికి ఘన సత్కారం

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అభినందనలు

35 ఏళ్ల పోలీస్ సేవలకు వీడ్కోలు

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : మూడు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖకు సేవలందించిన హోంగార్డు బి. వెంకటి ఉద్యోగ విరమణ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల సబ్‌యూనిట్‌కు చెందిన వెంకటి (హెచ్‌జీ-1071) ప్రస్తుతం అక్కడి వేలిముద్రల కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ 35 ఏళ్ల సేవలను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆయన సేవలను ప్రశంసించి, పూలమాల, శాలువాతో సత్కరించడంతో పాటు జ్ఞాపికను అందజేశారు. సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వర్తించిన వెంకటి సేవలు అభినందనీయమని పేర్కొంటూ, పదవీ విరమణ తర్వాత కుటుంబంతో ప్రశాంతంగా, ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, ఆర్ ఐ పెద్దన్న, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా హోంగార్డ్ ఇన్‌చార్జ్ ఏ ఆర్ ఎస్ ఐ బి. రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అక్టోబర్ 21-31 వరకు సంస్మరణ కార్యక్రమాలు

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేస్తూ వారి సేవలను స్మరించుకునేందుకు అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో వెల్లడించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజలు, యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాల ద్వారా పోలీసుల విధులు, ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలను వివరించనున్నారు. సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించి, కానిస్టేబుల్ నుంచి ఏఎసఐ స్థాయి వరకు ఒక కేటగిరీగా, ఎసఐ, పైస్థాయి అధికారులకు మరో కేటగిరీగా విభజించనున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల నుంచి ప్రజలు ఆశించే సేవలు, సామాజిక మాధ్యమాల వినియోగం, ప్రజల గౌరవం పొందేందుకు పోలీసుల పాత్ర, క్షేత్రస్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయడం వంటి అంశాలపై తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసాలు రాయవచ్చు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ఉత్తమ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురికి అవార్డులు అందించి రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తారు. రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలతో పాటు అమరవీరుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించే కార్యక్రమాలు చేపడతారు. అమరవీరుల విగ్రహాలు, ఫొటోల వద్ద పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు 3 ఫొటోలు, 3 నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్‌తో పోటీల్లో పాల్గొనవచ్చని కమిషనర్ సూచించారు. ఫొటోలు 10ఐ8 అంగుళాల పరిమాణంలో ఉండాలని, షార్ట్ ఫిల్మ్‌ను పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లో సమర్పించాలని తెలిపారు. అక్టోబర్ 23 సాయంత్రంలోగా స్పెషల్ బ్రాంచ్ (ఎసఐబీ) కార్యాలయంలో వాటిని అందజేయాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపిక చేసిన 3 ఉత్తమ ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపిస్తారు. అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ కళాబృందం పాటలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రధాన కూడళ్లలో అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్మృతి పరేడ్, పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

పండుగ సందడిలో భద్రతను మరవొద్దు

గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి పిలుపు

ఇళ్లకు తాళాలు, పిల్లలపై నిఘా, ఆన్‌లైన్ జాగ్రత్తలు అవసరం

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : దసరా, బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకునే క్రమంలో భద్రతా అంశాలను నిర్లక్ష్యం చేయవద్దని గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ప్రజలకు సూచించారు. పండుగలు, సెలవుల సమయంలో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లేవారు దొంగతనాల నివారణకు ముందుగానే చర్యలు తీసుకోవాలని, ఇంటి తలుపులు, కిటికీలకు తాళాలు సరిగా వేసినట్లు నిర్ధారించుకోవాలని తెలిపారు. నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను బహిరంగంగా ఉంచకూడదని, ఇంట్లో ఎవరూ లేరనే విషయం అపరిచితులకు తెలియనివ్వకూడదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, నంబర్ ప్లేట్ లేని వాహనాలు కనిపించినా, వీధులు లేదా కాలనీల్లో అనుమానాస్పద కదలికలు గమనించినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఊరికి వెళ్లే వారు ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి చెప్పాలని, అవసరమైన భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లే విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తెలియజేస్తే వివరాలు నమోదు చేసి నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరోవైపు, మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఇవ్వడం ప్రమాదకరమని హెచ్చరించారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు తెలుసుకుంటూ, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సెలవుల సమయంలో పిల్లల సెల్‌ఫోన్, సోషల్ మీడియా వినియోగాన్ని కూడా పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటి చిరునామా, కుటుంబ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, ప్రయాణానికి సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో బహిరంగంగా పెట్టకూడదని పిల్లలకు చెప్పాలన్నారు. అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించడం, తెలియని లింకులు లేదా ఫైల్స్ తెరవడం చేయవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. ఫొటోలను మార్ఫింగ్ చేసి నకిలీ ఖాతాల ద్వారా దుర్వినియోగం చేసే అవకాశమున్నందున సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైతే తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని కోరారు. పండుగల సందర్భంగా బస్సులు, రైళ్లలో, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు నగదు, ఆభరణాలు, సెల్‌ఫోన్లు, పర్సులు, హ్యాండ్‌బ్యాగులపై నిరంతరం దృష్టి ఉంచాలని, జేబు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే స్వయంగా ప్రమాదంలో పడకుండా పోలీసులకు సమాచారం అందించి సహాయం పొందాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యత అని పేర్కొంటూ, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరిస్తే దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలను నివారించవచ్చని సిఐ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి దసరా, బతుకమ్మ పండుగలను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

మహిళల భద్రతపై కాంగ్రెస్ మౌనం ఎందుకు?

జేఎన్‌యూ వ్యవహారంపై పెద్దపల్లిలో బీజేపీ మహిళా మోర్చా నిరసన

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ దిష్టిబొమ్మల దహనం

ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ రాజీనామా చేయాలని డిమాండ్

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : మహిళల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని బీజేపీ మహిళా మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. జేఎన్‌యూలో మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో పెద్దపల్లిలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు వడ్డేపల్లి భారతి నేతృత్వంలో అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి భారతి మాట్లాడుతూ, మహిళా విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్‌పై రావడం ఆందోళనకరమన్నారు. మహిళల గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ, చర్యలకు సంబంధించిన నివేదికల నేపథ్యంలో సంబంధిత నాయకులు బాధ్యతాయుతంగా స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, మహిళల హక్కుల గురించి మాట్లాడే రాహుల్ గాంధీ మహిళల ఆత్మగౌరవం, భద్రత విషయంలోనూ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని భారతి కోరారు. మహిళలపై వేధింపుల ఆరోపణల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని అన్నారు. ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాతంగి రేణుక మాట్లాడుతూ, మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. మహిళా విద్యార్థులపై వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలన్నీ బాధ్యతాయుతంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు సుల్వ పద్మ, బండారి లత, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్తూరి సరిత, జనగామ సుజాశ్రీ, జిల్లా అధికార ప్రతినిధి వసంత లక్ష్మి, దాసరి సుశీల, ఇరుగురాల శారద, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతకు పోలీసులతో సమన్వయం కీలకం

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

భద్రతపై బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా లోపాలను సరిదిద్దుకుని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పోలీస్ అధికారులతో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశమై భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఏటీఎంలు, మంచిర్యాల జోన్‌లో 109 బ్యాంకులు, 89 ఏటీఎంలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఏటీఎం వద్ద 24 గంటల సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. పోలీసుల తనిఖీల్లో కొన్ని చోట్ల నాసిరకం కెమెరాలు, గార్డులు లేని పరిస్థితులు బయటపడినందున వెంటనే లోపాలను సరిచేయాలని సూచించారు. బ్యాంకు ప్రవేశ ద్వారాల వద్ద డీఎఫ్ఎండీ, గార్డులకు హెచ్‌హెచఎండీ ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఫొటోలు, వ్యక్తిగత వివరాలను నమోదు చేసి ఉంచాలని అన్నారు. దోపిడీ వంటి ఘటనలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కెమెరాలపై స్ప్రే చేసి పనిచేయకుండా చేయడం, డీవీఆర్‌లను ధ్వంసం చేయడం లేదా అపహరించడం వంటి చర్యలను నివారించేందుకు రికార్డింగ్ పరికరాలను సురక్షితమైన రహస్య ప్రదేశాల్లో అమర్చాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని, దృష్టి మళ్లించి దోపిడీలకు పాల్పడే ముఠాలను గుర్తించేలా గార్డులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఏటీఎంలలో నగదు నింపే సమయాన్ని స్థానిక పోలీసులకు ముందుగానే తెలియజేయాలని, బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల సంప్రదింపు నంబర్లు, హెల్ప్‌లైన్ వివరాలను బ్యాంకుల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని అన్నారు. సెలవు రోజులు, తెల్లవారుజామున, బ్యాంకులు తెరిచే, మూసే సమయాలు, భోజన విరామ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పని వేళల్లో గార్డులు ప్రధాన ద్వారం వద్ద అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు మూసిన తర్వాత తలుపులు పూర్తిగా మూసివేసినప్పుడే సిబ్బంది బయటకు వెళ్లాలని సూచించారు. నగదు లేదా బంగారం తీసుకుని వెళ్లే ఖాతాదారుల కదలికలను గమనించాలని, వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో గార్డుల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఎస్ ఐలు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

పెయిన్‌కిల్లర్స్ దీర్ఘకాలిక వాడకంతో ప్రమాదం

మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్లు వేణుగోపాల్, రాకేష్

కరీంనగర్ టౌన్, అక్టోబర్12(ది క్రైమ్ న్యూస్) : ఆర్థరైటిస్ కీళ్ల వాతం సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాకేష్ సూచించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆద్వర్యంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో డాక్టర్స్ మాట్లాడుతూ కీళ్లలో వాపు, నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు కలిగించే పరిస్థితులను ఆర్థరైటిస్ అంటారని తెలిపారు. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సహా పలు రకాలుగా ఇది కనిపిస్తుందన్నారు.

వయసు పెరగడం, కీళ్లపై అధిక ఒత్తిడి, అధిక బరువు, గతంలో కీళ్లకు గాయాలు కావడం, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు వంటి కారణాలతో ఈ సమస్య తలెత్తవచ్చన్నారు. ఆర్థరైటిస్‌తో నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చుని లేవడం వంటి రోజువారీ పనులు కూడా బాధాకరంగా మారుతాయన్నారు. ఆర్థరైటిస్ తీవ్రత, కీళ్లకు జరిగిన నష్టం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయిస్తారని ప్రారంభ దశలో వైద్యుల సూచనల మేరకు మందులు, ఫిజియోథెరపీ, తగిన వ్యాయామాలు, బరువు నియంత్రణతో ఉపశమనం పొందవచ్చన్నారు. వ్యాధి ముదిరి కీళ్లలో తీవ్రమైన నష్టం ఏర్పడి, మందులు, ఇతర చికిత్సలతోనూ నొప్పి తగ్గకపోతే శస్త్రచికిత్సను పరిశీలిస్తామన్నారు. అవసరమైన సందర్భాల్లో మోకీలు లేదా తుంటి కీలు మార్పిడి శస్త్రచికిత్సతో నొప్పి తగ్గి, కదలికలు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. నొప్పి తగ్గించే మందులను వైద్యుల సలహా లేకుండా తరచుగా వాడటం వల్ల కడుపులో అల్సర్లు, రక్తస్రావం, మూత్రపిండాలు, గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరగవచ్చన్నారు. అదే సమయంలో నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్ల కదలికలు తగ్గి రోజువారీ జీవితంపై ప్రభావం పడుతుందని తెలిపారు. బరువు అదుపులో ఉంచుకోవడం, కీళ్లపై అధిక ఒత్తిడి పడకుండా చూడటం, వైద్యుల సూచనలతో వ్యాయామం చేయడం, మందులను సూచించిన విధంగానే వాడటం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చని సూచించారు. ఈ అవగాహన సదస్సులో అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జ్ఞానేశ్ ఇష్యూలో కాక్రోచ్‌లకు కాంగ్రెస్ షాక్

కాక్రోచ్ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌ను కాపాడుకునేందుకు రాహుల్ వేస్తున్న ఎత్తుగడలు ప్రస్తుతానికి తిరుగులేని ఫలితాలనిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ ఉద్యమం సందర్భంగా జంతర్ మంతర్ వద్ద బైఠాయించి, ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన కాక్రోచ్ జనతా పార్టీ విపక్ష స్పేస్‌లో అప్పట్లో భారీ మైలేజీని కొల్లగొట్టింది. విద్యార్థి, యువజన ఉద్యమాలను తమ ఖాతాలో వేసుకుంటూ ఆ పార్టీ సృష్టించిన ప్రభంజనం కాంగ్రెస్ ఉనికికే సవాలుగా నిలిచింది. సరిగ్గా అదే అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న హస్తం పార్టీ అగ్రనాయకత్వం.. కేంద్ర ఎన్నికల సంఘం వివాదంలో ఆ తప్పు మళ్లీ జరగకూడదని పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాక్రోచ్‌లు మొదలుపెట్టిన నిరసన స్వరాన్ని కాంగ్రెస్ తెలివిగా తన అధీనంలోకి తీసుకుంది.ప్రస్తుతం జాతీయ మీడియాలోనూ, సోషల్ మీడియా ట్రెండ్స్‌లోనూ కేవలం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల గురించే చర్చ సాగుతోంది. ఆకాశవాణి భవన్ ఆవరణలో 9 గంటల పాటు చెట్టు కింద బైఠాయించడం, జంతర్ మంతర్ వద్ద ప్రియాంక గాంధీ నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలపడం, రాహుల్ గాంధీ ఎఫ్ఐఆర్‌లు నా మెడల్స్ అంటూ దూకుడుగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటి పరిణామాలు కాక్రోచ్ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలను పూర్తిగా నీరుగార్చాయి. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. రోజూ ఏపీలోని పార్లమెంట్ సభ్యుల నుంచి మొదలుకొని అగ్రనేతల వరకు ఎవరు ఎప్పుడు రోడ్డెక్కాలి, ఎక్కడ డిటెన్షన్ కావాలనే పక్కా డైలీ షెడ్యూల్‌ను కాంగ్రెస్ ముందే సిద్ధం చేసుకుని నడిపిస్తోంది. ఫలితంగా, ఉద్యమ పార్టీగా పేరున్న కాక్రోచ్‌ల నిరసనలకు మీడియాలో కనీస ప్రాధాన్యత కూడా దక్కని పరిస్థితి తలెత్తింది.ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహారంలో ఆ ఘనత మొత్తం కాక్రోచ్‌ల ఖాతాలోకి వెళ్లిపోవడంతో చేతులు కాలిన కాంగ్రెస్.. జ్ఞానేశ్ కుమార్ ఇష్యూలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఈసీ రాజీనామా చేయడమో లేక కేంద్రం దిగిరావడమో జరిగితే.. ఆ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పోరాటం వల్లే సాధ్యమైందనే నేరేటివ్‌ను ప్రజల్లో బలంగా నాటడమే రాహుల్ టీమ్ అసలు లక్ష్యం. సీఈసీ అంశంపై తాము రోడ్లపైకి వచ్చి అరెస్టులు కావడం ద్వారా.. కాక్రోచ్ పార్టీని కేవలం అండర్‌గ్రౌండ్ కార్యకర్తల స్థాయికే పరిమితం చేసి, తామే అసలైన ప్రజాస్వామ్య పోరాట శక్తులమని దేశానికి చాటడంలో కాంగ్రెస్ వ్యూహం ముందడుగు వేసింది.ఈ ఆధిపత్య పోరులో కాక్రోచ్‌లు అంత సులభంగా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. అక్టోబర్ 10న జంతర్ మంతర్‌ను భారీ ఎత్తున ముట్టడిస్తామని వారు ఇప్పటికే గడువు విధించి, తమ శ్రేణులను ఢిల్లీకి తరలించే సన్నాహాల్లో ఉన్నారు. కానీ, ఆ ముట్టడి రోజున కూడా కాంగ్రెస్ ఊరికే కూర్చునే అవకాశం కనిపించడం లేదు. అప్పటికే పార్లమెంట్ సభ్యులు, కూటమి సీనియర్ నేతలతో కలిసి మరింత పెద్దఎత్తున ప్రత్యక్ష నిరసనలను హోరెత్తించి, కాక్రోచ్‌ల కార్యక్రమాన్ని పూర్తిగా హైజాక్ చేయడానికి కాంగ్రెస్ గ్రౌండ్‌వర్క్ సిద్ధం చేస్తోంది. బీజేపీతో నేరుగా తలపడటంతో పాటు.. విపక్ష స్థానాన్ని ఆక్రమించాలనుకుంటున్న కాక్రోచ్‌లను వెనక్కి నెట్టి, తనే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవడమే కాంగ్రెస్ అసలు రాజకీయ పోరాటంగా మారింది జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు ముఖ్య నేతలు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకాలను కోర్టు విడుదల చేసింది. శనివారం విమానం దిగగానే విమానాశ్రయం నుంచే వారిని ముందస్తుగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, ఆదివారం ఉదయం ఢిల్లీ క్యాంట్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఏడాది పాటు దేశంలో ఎలాంటి శాంతిభద్రతల విఘాతానికి లేదా శాంతిభంగానికి పాల్పడకూడదనే కఠిన షరతుపై రూ.50,000 ముందస్తు బెయిల్ బాండ్‌తో కోర్టు వారికి ఉపశమనం కల్పించింది.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సిజెపి ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు విమానాశ్రయంలోనే దిప్కే బృందాన్ని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. విమానం లోపలికే వచ్చి పోలీసులు తమను అరెస్టు చేస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దిప్కే, ఇది అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జనం గుమిగూడకుండా నగరవ్యాప్తంగా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసిన ఢిల్లీ పోలీసులు, నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. శనివారం నాటి ఆందోళనల్లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు సుమారు 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వేళ విడుదల చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా శనివారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు విడుదల చేశారు.సిజెపి అగ్రనేతలు విడుదలైనప్పటికీ, ఢిల్లీ వ్యాప్తంగా ఇంకా పోలీసుల పహారా కొనసాగుతోంది. రాజధానిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు తమ పోరాటాన్ని చట్టబద్ధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

టార్గెట్ 100 గిగావాట్ పవర్

న్యూఢిల్లీ,అక్టోబరు 12 (న్యూస్ పల్స్) వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. 2047 బ్లూ ప్రింట్ రెడీ చేసిన కేంద్రం.. దానికి తగ్గట్టుగా చర్యలు చేపడుతోంది. అభివృద్ధికి విద్యుత్ ముఖ్యం.. అది కూడా భారీగా కావాలి. అందుకు తగినట్లుగా అణువిద్యుత్ పై కేంద్రం ఫోకస్ పెట్టింది.2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచినట్లు అణుశక్తి కమిషన్ ఛైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రైవేట్ కంపెనీలు 7.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టి, 30 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుతం భారత్‌లో 9 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, ప్రభుత్వ సంస్థ ఔఖఅఎఐ 24 రియాక్టర్లను నడుపుతోంది. మరో 17 రియాక్టర్ల నిర్మాణం జరుగుతోంది. అణురంగాన్ని వేగవంతం చేసేందుకు తెచ్చిన శాంతి చట్టంతో ప్రైవేట్ కంపెనీల ప్రవేశానికి మార్గం సుగమమైందని ఐదేళ్లలో ప్రైవేట్ సంస్థలూ రియాక్టర్లను నిర్వహిస్తాయని ఔఆ తెలిపింది. ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తికి 25 కోట్లు ఖర్చవుతుందని, ఉక్కు సిమెంట్, భారీ పరిశ్రమల అవసరాలకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీని ప్రభుత్వం పరిశీలిస్తోంది."ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' ప్రస్తుతం 24 రియాక్టర్లను నిర్వహిస్తోంది. ప్రైవేట్ సంస్థలు కూడా అణు విద్యుత్ రంగంలోకి రావాలని భావిస్తున్నాం. అందుకే కొత్తగా శాంతి చట్టాన్ని తీసుకువచ్చాం. రాబోయే ఐదేళ్లలో ఒకటి రెండు ప్రైవేట్ రంగ సంస్థలు రియాక్టర్లను నిర్వహిస్తాయని ఆశిస్తున్నాను. 2047 నాటికి వారి నుంచి సుమారు 30 ఉచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మేము అంచనా వేస్తున్నాం. 1 ఓచి విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ. 25 కోట్లు ఖర్చు అవుతుంది" అని మొహంతి పేర్కొన్నారు.దేశీయ వనరైన థోరియంను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా భారత్ మూడంచెల అణు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. మొదటి దశలో యురేనియం ఇంధనంగా వాడే రియాక్టర్లను ఉపయోగిస్తారు. ఇవి పనిచేస్తున్నప్పుడు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు, ప్లుటోనియం-239ను కూడా ఉత్పత్తి చేయగలవు. వాడిన అణు ఇంధనాన్ని పునఃప్రక్రియ చేయడం ద్వారా దీనిని తిరిగి పొందవచ్చని మొహంతి అన్నారు. ఇలా తిరిగి పొందిన ప్లుటోనియంను ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీ ఆధారంగా రెండో దశలో ఉపయోగిస్తారు. ఈ దశ అదనపు విచ్చిన్న పదార్థాల ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి, చివరికి థోరియం వినియోగాన్ని సులభతరం చేయడానికి రూపొందించిందని అన్నారు. "మూడో దశలో థోరియంను అణు ఇంధనంగా ఉపయోగపడే విచ్చిన్న పదార్థంగా మార్చాలని భావిస్తున్నారు. థోరియంను ముందుగా తగిన విచ్చిన్న పదార్థంగా మార్చకుండా నేరుగా సంప్రదాయ రియాక్టర్ ఇంధనంగా ఉపయోగించలేరు. ఈ సాంకేతిక సవాలును అధిగమించి, దేశీయ వనరులను మరింతగా ఉపయోగించుకునే అణు ఇంధన చక్రానికి అంతిమంగా మద్దతు ఇవ్వడానికే భారత్ మూడు- దశల కార్యక్రమాన్ని రూపొందించింది." అని మొహంతి అన్నారు.మోనజైట్ కలిగిన సముద్రతీర ఇసుకతో ముడిపడిన థోరియం వనరులు భారతదేశంలో గణనీయంగా ఉన్నాయి. "ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో సహా తీర రాష్ట్రాల్లో సముద్రతీర ఇసుక ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వాటి నుంచి మోనజైట్‌ను వెలికితీయవచ్చు. వాటి నుంచి సరైన ప్రక్రియ ద్వారా థోరియంను తిరిగి పొందవచ్చు. ప్రపంచ థోరియం నిల్వల్లో 25 శాతం భారతదేశంలోనే ఉన్నాయి." అని ఆయన తెలిపారు. ఈ క్రమంలో తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయవంతంగా క్రిటికాలిటీని సాధించింది. ఇది అందుబాటులోకి వస్తే రష్యా తర్వాత వాణిజ్య ప్రాతిపదికన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌ను నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది.

కర్నాటక కాంగ్రెస్‌కు స్టింగ్ ఆపరేషన్ టెన్షన్..

బెంగళూరు : కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలు జరుగుతున్నాయా.. మంత్రులు, సీఎంపైనే స్టింగ్ ఆపరేషన్లకు ప్రయత్నాలు జరిగాయా.. లేటెస్టుగా సీఎం డికె శివకుమార్.. ఇదే విషయమై సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. "నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు" అని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు బయటపెట్టలేనన్నారు.

తెలుగు గంగ నీటిపై చర్చలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్ఠాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది.

ఇంద్రయాగం నందవ్రజం ఆగమాగం

శుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా! గోకులంలో నందాది వృద్ధ గోపకులు ఇంద్ర యాగానికి సిద్ధపడటం చూచి సర్వజ్ఞుడైన శౌరి వారిని ఇలా ప్రశ్నించి వారించాడు- 'నాన్నగారూ! మీరీ జన్నాన్ని (యాగాన్ని) పరిపాటిగా- పరం పరగా వస్తున్న ఆచారంగా భావించి చేస్తున్నారా లేక యాగ రహస్యం తెలిసి ఆచరిస్తున్నారా? దీనికి, 'పుత్రకామేష్టి'వలన పుత్రప్రాప్తి వలె దృష్ట- ఐహిక ఫలమా లేక జ్యోతిష్టోమానికి స్వర్గప్రాప్తి వలె అదృష్ట ఆముష్మిక- లోకాంతర ఫలమా? శాస్త్రవిధి విధానం తెలిసి చేస్తేనే కర్మలు ఫలిస్తాయి. తెలియక చేస్తే ఫలించవు కదా! మీ ఉద్దేశం నాకు చెప్పండి'. 'ఇంత చిన్నవాని మాటలు ఎంతలేసి పెద్దవో' అంటూ చెంతనున్న వారంతా ఒకింత వింతగా చూచారు. రాజా! గడుసరి కొడుకు గోవిందునికి తండ్రి నందుడు ముక్తసరిగా ఇలా సమాధాన మిచ్చాడు.. 'కుమారా! ఇది పరంపరగా వస్తున్న ఆచారమే. ఇంద్ర యాగం చేస్తే దేవేంద్రుడు సంతసించి నిరంతర వర్షధారలు కురిపిస్తాడు. అంత పాడిపంటలు మరింతగా పెరుగుతాయి. మన జీవితాలు సుఖవంతాలవుతాయి'. జనకుని పలుకులు విని జనార్దనుడు బాల ముకుందుడు సునాసీరు- ఇంద్రునికి కినుక చాల హెచ్చునట్లు నందునితో ఇలా అన్నాడు.. తండ్రీ! కర్మ చేతనే ప్రాణి వర్గానికి జన్మ, వృద్ధి, క్షయాలు. కర్మలే జీవుల సుఖదుఃఖాలకు కారణం. కర్తకు వాని కర్మలే తగిన ఫలాలను ప్రసాదిస్తూండగా మధ్యలో ఈశ్వరుని- ఇంద్రుని ప్రసక్తి ఎందుకు? ఆ ఈశ్వరుడు కూడా కర్మ చేసిన వానికే ఫలమిస్తాడు కాని, ఏ కర్మా చేయని వానికి ఏమీ ఇవ్వడు కదా! కర్మఫలాలను ఏ ధర్మదేవతా తప్పించలేదుగా! జీవునికి కర్మమే దైవతం. 'తస్మై నమః కర్మణే'- అతడు కర్మనే దైవంగా భావించి సంభావించాలి- ఆరాధించాలి. కర్మల, ఆయా ఫలాల మర్మ- రహస్యమిలా ఉండగా నడుమ బిడౌజుని- అమరేంద్రుని ప్రమేయం ఏముంది? కనుక, అతనికి కినుక పూనవలసిన పని లేనేలేదు.



ఆధ్యాత్మికం

లక్ష్యంతో పయనిస్తే లక్ష్య సాధన మీ తోటే

- మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమత రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : విద్యార్థులు ఒక లక్ష్యంతో పయనిస్తే లక్ష్యసాధన మిమ్ములను వెతుక్కుంటూ వస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమత రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో సోమవారం జరిగిన ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, బీటెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే ఆగమనం 2౨26 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ , మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ట్రినిటీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఏ ఒక్కరు కూడా ఖాళీగా ఉండరని, దానికోసం రానున్న రోజుల్లో మెగా ఉద్యోగ మేళా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉద్యోగిగా మారేలా దోహదపడదామని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలోని మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాల నాక్ అక్రిడేషన్ మరియు అటానమస్ పొందిన కళాశాలగా గుర్తించబడినందుకు అభినందించారు. దీనికోసం గత కొద్ది మాసాలుగా ఇంజనీరింగ్ కళాశాలలో ఫీల్డ్ ట్రిప్, ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాలు నిర్వహించి సాంకేతికపరంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారని, ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు, పరిశ్రమల్లో బీటెక్ విద్యార్థుల పాత్ర, తమ యొక్క కళాశాల విద్యార్థులు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లో ముందు వరుసలో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి ఆకతోన్స్ ఇన్నోవేషన్ ఐడియాస్ లో తమ విద్యార్థులు చాలా సందర్భాల్లో ప్రతిభను కనబరిచారని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ కళాశాలపై 15కుపైగా నూతన ఆవిష్కరణలు చేసి పేటెంట్లు చేశామని, తమ కళాశాలకు కేంద్ర ప్రభుత్వంచే ఎం ఎస్ అని ఇంక్యుబేషన్ సెంటర్ ఆమోదం లభించిందని అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం పిఎంసి శ్రీ స్కూల్సో 1,50,000 ఒక్కొక్క స్కూలుకి ఇన్నోవేషన్ మరియు రీసెర్చ్ పెంపొందించిన కొరకు తమ కళాశాలకు ఇవ్వడం జరిగిందని, రానున్న కాలంలో ఏఐ తో జరగబోయే పరిమాణాలు అవకాశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా బీటెక్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరియు క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఏవో సురేష్, డా. నటరాజన్ ,రాజిరెడ్డి, చొప్పరి వంశీ, ఈ ఈ ఈ హెచ్ఓడీ వంశీ, ఈ సి ఈ హెచ్ఓడీ ప్రభాకర్, స్వాతి, లక్ష్మి, పద్మిని, డాక్టర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.ఖ

డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం.

కూకట్ పల్లి అక్టోబర్ 12 (ది క్రైమ్ న్యూస్) :ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ వెల్ విషర్ కాలనీకి చెందిన పి.విజయలక్ష్మి(65) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులను ఆదేశించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. యాదగిరి, జనార్ధన్, రవీందర్, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోర్టు ఆర్డర్ ఇచ్చిన పట్టించుకోని అధికారులు....

- ఆర్డీవోకి ఫిర్యాదు చేసిన బాధితుడు

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి సిడిపివో కార్యాలయంలో ఏ సిడిపివో గా విధులు నిర్వహించిన శోభారాణి అనారోగ్యంతో మృతి చెందగా సర్వీస్ బుక్ కావాలని అడుగుతున్న ఇబ్బందులు పెడుతున్నారని, హై కోర్టు ఆర్డర్ తెచ్చిన పట్టించుకోవడం లేదని ఆమె కుమారుడు కరుణాకర్ ఆర్డీవో కు ఫిర్యాదు చేశారు. గత కొన్ని ఏళ్లుగా తిరుగుతున్న కూడా సర్వీస్ బుక్ ఇవ్వడం లేదని , ఇవ్వాలంటే 15 లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితుడు తెలిపారు. అప్పటికి సిడిపివో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుల్తాన్ కు 5 లక్షలు ఇచ్చానని మిగతా 10 లక్షలు ఇస్తేనే సర్వీస్ బుక్ ఇస్తానని పేర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆయన కోరారు.ఖ

పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించండి...

ప్రజావాణిలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుల వినతిలు.....

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. పట్టణంలో జనాభా పెరుగుతున్న కారణంగా విపరీతమైన ట్రాఫిక్ సమస్య, తదితర సమస్యలపై పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య పెరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కమాన్ కూడలి, కునారం రోడ్డు కూడలి ప్రాంతాల్లో అత్యధిక రద్దీ వల్ల ట్రాఫిక్ కోన్స్ రాజీవ్ రహదారికి డైవర్షన్ కొరకు పెట్టడం వలన కరీంనగర్ నుండి గోదావరిఖని వైపు వెళ్లే భారీ వాహనాలు భారీ వాహనాలు ఆగకుండా స్పీడ్ తో వెళ్లడంతో రోడ్డు క్రాసింగ్ చేసే పాదచారులకు తీవ్ర ఇబ్బంది సమస్య నెలకొందన్నారు. ట్రాఫిక్ కోన్స్ తక్షణమే తీసివేసి సిగ్నల్ వ్యవస్థ మొదలుపెట్టి ప్రమాదాల బారిన పడకుండా చూడాల్సిందిగా కోరారు. అదేవిధంగా నిరుపయోగంగా ఉన్న పారిశుద్ధ కార్మికుల విగ్రహాలను వెంటనే వారి అవునత్యాన్ని పెంచేలా జెండా కూడలిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్క అశోక్ ,మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

కూకట్ పల్లి అక్టోబర్ 12 (ది క్రైమ్ న్యూస్) : ఓటు చోరీ అంటే ప్రజాస్వామ్యం పై దాడి అని ఓటర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పోరాటం చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య పునాదులనే బలహీనపరుస్తాయని అన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ఓట్ల తొలగింపు, ఓటర్ల హక్కులకు విఘాతం కలిగిందనే ఆరోపణల పై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రభావంలో ఎన్నికల సంఘం పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని నిరూపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడటం దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఓటు చోరీ అంటే ప్రజల తీర్పును దొంగిలించడమే. ప్రజల ఓటు హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కోట్లాది మంది ఓటర్ల హక్కుల పై ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు ఎన్నికల సంఘం మౌనంగా ఉండకూడదన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి. ఆయన హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల పై సమగ్ర, నిష్పక్షపాత పునఃసమీక్ష జరగాలని, చట్టవిరుద్ధ చర్యలు నిర్ధారణ అయితే బాధ్యుల పై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి” అని డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రతి పౌరుడి ఓటు హక్కును సంరక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఓటుతో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో పారదర్శకత, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి అత్యంత అవసరమని తెలిపారు.

యాసంగి ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించిన కోఆర్డినేటర్ డా. తిరుపతి.

ధర్మపురి, అక్టోబర్ 12,(ది క్రైమ్ న్యూస్) : యాసంగి ఆరుతడి పంటలపై రైతులకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జగిత్యాల మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్నినో పై సోమవారం కోఆర్డినేటర్ డా. తిరుపతి అవగాహన కల్పించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జగిత్యాల మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్నినో ప్రభావం మరియు యాసంగి లో సాగు చేయాల్సిన ఆరుతడి పంటలపై అవగాహన కార్యక్రమాన్ని ధర్మపురి మండలం నగారం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం జగిత్యాల కోఆర్డినేటర్ డా తిరుపతి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం తో రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదావడం తో పాటు, భూగర్భ జలాలు కూడా తగ్గిపోతూ ఉందని ఆయన తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతుకు ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆరుతడి పంటలు సాగు చేయాలని మన ప్రాంతానికి అనువైన ఆరుతడి పంటలు వాటి సాగు గురించి వివరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్ లు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నీటి ఎద్దడి పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని వారు రైతు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అధికారులు

ధర్మపురి, అక్టోబర్ 12, (ది క్రైమ్ న్యూస్) : జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానములో దసరా నవరాత్రోత్సవములలో భాగంగా సోమవారం రెండవ రోజు ప్రధాన దేవాలయముతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో విశ్వక్సేన పూజలు, దీపారాధనలు మొదలగు కార్యక్రమములను ఆలయ అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయము (శివాలయము) లో ఉదయము దసరా (దేవీ) నవరాత్రుల ఉత్సవములలో భాగంగా రెండవ రోజు ఉదయము 9.30 గం.లకు వేదపండితులు, ఋుచ్చికులచే మహా సంకల్పము, పుణ్యకలశ, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహ వచనము, రుచ్చిక వర్ణనము, అఖండ దీప స్థాపన, నవగ్రహ, వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, అంకురారోపణ, మాతృక, సర్వతోభద్ర మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు నిర్వహించారు. ఇందులో భాగంగా సప్తశతీ పారాయణము, అమ్మ వారికి చతుష్షష్టి పూజ, శ్రీచక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మరియు కన్యకా, సువాసిని పూజలు నిర్వహించారు. సోమవారం రోజు అమ్మ వారు బ్రహ్మచారిణి పసుపు రంగు చీరలో మల్లెపూలు, బిల్వపత్ర దండలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, మాజీ దేవస్థాన అధ్యక్షులు జక్కు రవీందర్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలేపు ప్రవీణ్ శర్మ, ఓంకార్ శర్మ, ఋుచ్చికులు తాడూరి బలరాం శర్మ, అలువాల కృష్ణ శర్మ, భరత్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల విజయ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్ కుమార్, అభిషేక పురోహితులు బొజ్జ రాజగోపాల్ శర్మ మరియు అర్చకులు సిబ్బంది, ఋుచ్చికులు పాలేపు సందీప్ శర్మ, మరియు ఇతర ప్రముఖులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొనగా సాయంత్రము 6.00 గం,లకు శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఉరేగింపు సేవ గ్రామములోని పురవీధులలో తిరిగి దేవాలయమునకు వచ్చునని మరియు సాయంత్రం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి షోడశోపచార పూజతో హారతి, మంత్రపుష్ప, తీర్థప్రసాద వితరణ జరుపబడినని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

గ్రామాన్ని విడతలవారీగా అభివృద్ధి చేస్తా.

పెండ్యాల గ్రామ సర్పంచ్ జైత్వారం జగన్మోహన్ రెడ్డి.

మహేశ్వరం అక్టోబరు 12, (ది క్రైమ్ న్యూస్) : గ్రామాలలో బతుకమ్మ సందడి మొదలైంది కదా మరీ మహిళలు బతుకమ్మలు ఆడిన తరువాత ఆ బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆ సమయంలో మహిళలు పడుతున్న బాధలు అర్థం చేసుకున్న ఓ సర్పంచ్ చెరువు లోపల మెట్ల పనులు ప్రారంభించారు. గతంలో ఆ చెరువుకు బయటిపక్క మెట్లు నిర్మించారు. వివరాల్లోకి వెళ్తే మహేశ్వరం మండల పరిధిలోని పెండ్యాల గ్రామ పంచాయతీకి గ్రామ పంచాయతీకి అనుకొని ఉన్న చెరువుకు ఆ గ్రామ సర్పంచ్ జైత్వారం జగన్మోహన్ రెడ్డి మెట్లను ఏర్పాటు చేస్తున్నాడు. ఇక మహిళలకు ఏటా నిర్వహించే బతుకమ్మల సమయంతో ఏ ఇబ్బందులు లేకుండా బతుకమ్మలను బయంలేకుండ నిమజ్జనాలు చేసుకోవడంతో పాటు చెరువుకు మరింత ఆకర్షణీయంగా ఏర్పడుతుంది. సోమవారం చెరువు మెట్లు నిర్మిస్తున్న క్రమంలో (ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి) పరిశీలించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని విడతలవారీగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా నిత్యం ప్రయత్నం చేస్తామని తెలిపారు.

నూతన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించిన పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ.

కూకట్ పల్లి అక్టోబర్ 12 (ది క్రైమ్ న్యూస్) : శంషిగూడ, హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, సిబ్బందికి వసతి కల్పించడం గొప్ప విషయం అని, ఇది నేటితో అందుబాటులోకి రావడం జరుగిందని గాంధీ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులైన అధ్యక్షులు పి. రత్న ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం. బాబు రావు, ప్రధాన కార్యదర్శి ఎం. యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి. వెంకట రావు, ఎస్. రామనాథం తో పాటు, హెచ్ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జంతర్ మంతర్ ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం దుర్మార్గమైన చర్య

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదు: జాజుల లింగంగౌడ్.

న్యూఢిల్లీ (ది క్రైమ్ న్యూస్) : జంతర్ మంతర్ వద్ద ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం, నిరసనలపై ఆంక్షలు విధించడం దుర్మార్గమైన చర్య అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు, హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ధర్నా చౌక్‌లు కీలక వేదికలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. జంతర్ మంతర్ అనేక ప్రజా ఉద్యమాలకు, సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాలకు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు వేదికగా నిలిచిందని తెలిపారు. అలాంటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన నిరసన వేదికను తొలగించడం లేదా అక్కడ నిరసనలపై ఆంక్షలు విధించడం ప్రజల భావప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

మిర్యాలగూడలో రాపా సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్ అండ్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం

అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.

మిర్యాలగూడ. (ది క్రైమ్ న్యూస్): పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన రాపా సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్ అండ్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీూ=) తనయుడు బత్తుల సాయి ప్రసన్న కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, నూకల వేణుగోపాల్ రెడ్డి హాజరై నూతన వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన వైద్య పరీక్షలు అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ప్రజలకు వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వేదాంతు

లెర్నింగ్ సెంటర్ లో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్ లు ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజకి వినతి పత్రం.

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 11: ఖమ్మం నగరంలో వేదాంతు లెర్నింగ్ సెంటర్ పేరుతో ఇంటర్మీడియట్ కళాశాలను నడుపుతూ, మెగా వేదాంతు స్కాలర్షిప్ అడ్మిషన్ టెస్ట్ పేరుతో పరీక్షలు నిర్వహిస్తూ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్ లు కల్పిస్తామని చెబుతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ వేలాదిమంది విద్యార్థులతోటి వారి చదువుల తోటి చెలగాటం ఆడుతున్న వేదాంతు లెర్నింగ్ సెంటర్ పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ కి వినతి పత్రం ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు తిప్పారపు.లక్ష్మణ్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వేదాంతు లెర్నింగ్ సెంటర్ పేరు తోటి నడుస్తున్న బడా కార్పొరేట్ లెర్నింగ్ సెంటర్ లో ఇంటర్మీడియట్ బోర్డ్ అనుమతి లేకోకుండా జూనియర్ కళాశాల నిర్వహిస్తూ ఇంటర్మీడియట్ అడ్మిషన్ లు నిర్వహించి ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. నాణ్యమైన బడా కార్పొరేట్ విద్య పేరుతోటి లక్షల రూపాయలు ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి దండుకుంటున్నారు. ఈ సందర్భంగా నే 2026 - 27 అకాడమిక్ ఇయర్ పూర్తికాకుండానే 2027 - 28 అకాడమిక్ ఇయర్ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆన్లైన్ లో ఎం వి ఎస్ ఏ టి (మెగా వేదాంతు స్కాలర్షిప్ అడ్మిషన్ టెస్ట్) పేరుతో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ ఈ పరీక్షలో ఎలిజిబుల్ అయిన విద్యార్థులకు వేదాంతు లెర్నింగ్ సెంటర్ లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ ఇస్తామని ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు మీ పిల్లలకు మెరిట్ మార్కులు వస్తే కళాశాల ఫీజులో భారీ డిస్కౌంట్ లు ఇస్తామని మోసానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రభుత్వ నిబంధనలు లెక్కచేయకుండా, నిబంధనలకు వ్యతిరేకంగా లెర్నింగ్ సెంటర్ పేరుతో ఇంటర్మీడియట్ కళాశాల నడుపుతున్న బడా కార్పొరేట్ వేదాంతు లెర్నింగ్ సెంటర్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిరి.రఘు, జిల్లా నాయకులు శ్రీనాథ్, చిట్టిబాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ దేశ భవిష్యత్తును మార్చాల్సింది నేటి యువతరమే

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 11: సోమవారం పి వై ఎల్ లక్ష్మీదేవి పల్లి మండలం మహాసభ అమరుడు కామ్రేడ్ బుద్ర నగర్ లో డివిజన్ నాయకులు కామ్రేడ్ లిక్కి నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ మాసభలో కామ్రేడ్ రవి మాట్లాడుతూ సోమవారం 2023 లో వచ్చినటువంటి యువతర ఉద్యమాలలో భాగమే సర్ ప్రక్రియను ప్రారంభించారని ఆ సర్ ప్రక్రియలో భాగమే ముస్లిమ్స్, క్రిస్టియన్స్ అని ఓట్లు తొలగిస్తూ వలసవాదులు, అక్రమదారులు, అక్రమ చొరబాటుదారులు అనే పేర్లతోటి ఓట్లను తొలగించే నేపథ్యం నుంచి ఈరోజు జన్జీ ఉద్యమంలో పాల్గొంటున్న ప్రశ్నిస్తున్న ఈ దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువతరం ఓట్లు తీసేసే వరకు ఈ ప్రక్రియ వచ్చిందని ఆయన అన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండా యువతరాన్ని దేశ భవిష్యత్తుకి ఉపయోగించకుండా అందాకారం వైపు నడిపిస్తున్న ఈ పాలకవర్గాలపై తిరుగుబాటు అనివార్యంగా వస్తుందని వారు అన్నారు సామ్రాజ్యవాదం కార్పొరేట్ శక్తులు ఏకమైపోయి నాడు ప్రశ్నించే గొంతుకులని మొత్తం కూడా ఉపా, కేసులు టాడా కేసులు, దేశద్రోహులని అక్రమంగా వారిపై కేసులు బనాయించి నిర్బంధించిన ఈరోజు ఇంకా ఉవ్వెత్తిన ఉద్యమాలు ఉవ్వెత్తిన వస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రెండు కోట్ల ఉద్యోగాలు ప్రకటిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని రాజీవ్ యువశక్తి లాంటి పథకాలు, లోన్లు అనేకం ఇస్తామని చెప్పి మాయమాటలు చెప్పినటువంటి ఈ పాలకులు నేడు ఒక్కటి కూడా అమలు చేయడం లేదని వారు అన్నారు. అల్లూరి సీతారామరాజు, చేగువేరా, భగత్ సింగ్,జంపాల, పగడాల వెంకన్న, నంబూరీ సీతారామారావు, తుడుం రామయ్య, బుద్ర, వేములపల్లి కిరణ్ లాంటి నాయకులు అమరత్వ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని అప్పుడే ఈ దేశ భవిష్యత్తు మారుతుందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ పివైఎల్ డివిజన్ నాయకురాలు కామ్రేడ్ సంధ్య ఆవిష్కరణ చేయగా, అమరవీరుల సంతాప తీర్మానం డివిజన్ నాయకులు కామ్రేడ్ వీరన్ ప్రవేశపెట్టగా ఈ కార్యక్రమంలో లిక్కి నరేష్, భానోత్ నవీన్, కట్టం ఎడమ చోటు దూల రాధా దేవి, ఉంగ గణేష్, రాజేష్, రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెనుక నుంచి కారు ఢీకొని యువకుడు మృతి

మేడ్చల్, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్) : ఈసీఐఎల్ నుంచి రాధిక ఎక్స్ రోడ్స్ వైపు వెళ్లే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జై భవాని బార్ ఎదురుగా అక్టోబర్ 11న రాత్రి 10.45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం రామనగూడెం గ్రామానికి చెందిన ఈక అఖిల్ (20) ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఖార్కానాలో నివాసం ఉంటున్నాడు. కుషాయిగూడలోని జెప్టో శాఖలో ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న అఖిల్ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టాటా నెక్సాన్ కారు (టీఎస్10ఎఫ్2958) వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ అతడి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా, అదే రోజు రాత్రి 11.36 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి మేనత్త కుంజ శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కారు డ్రైవర్‌పై క్రైమ్ నంబర్ 770/2026, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం కోసం అనసూయ హత్య మిస్టరీ ఛేదించిన కామారెడ్డి పోలీసులు

కామారెడ్డి పట్టణ పోలీసులను జిల్లా ఎస్పీ ఎం రాజేశ్ చంద్ర అభినందించారు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి పట్టణంలో కలకలం రేపిన అనసూయ హత్య కేసులో మిస్టరీ వీడింది. బంగారు ఆభరణాలను దోచుకునే పథకంతో అనసూయను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ కేసులో బోసు రజిత (40), బోసు నర్సింగ్ (48) అనే భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణ ప్రకారం. 2026 సెప్టెంబర్ 29న అనసూయ భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఆమె ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఇదే అదనుగా భావించిన రజిత తన భర్త నర్సింగ్‌తో కలిసి అనసూయ ఇంట్లోకి ప్రవేశించారు. అనసూయ పూజ చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆమెను మరో గదిలోకి తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె ధరించిన బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లువెల్లడించారు. నేరంపై అనుమానం రాకుండా రజిత యథావిధిగా అనసూయ ఇంట్లో పనులకు వెళ్లి వచ్చినట్లు నటించినట్లు విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. కాగా, రజిత గతంలో కామారెడ్డిలోని భూమయ్య ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన సమయంలోనూ బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. 2023 సెప్టెంబరులో ఇంటి యజమాని బయటకు వెళ్లగా, ఆయన భార్య తన కుమార్తెను రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరని గమనించి సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడు, 5 గ్రాముల బంగారు చెవి కమ్మలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుత హత్య కేసులో నిందితుల నుంచి బంగారు పుస్తెల తాడు (మంగళసూత్రం), రెండు బంగారు ఉంగరాలు, చెవి ఆభరణాలు కలిపి సుమారు 8 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన కామారెడ్డి పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగారావు, పోలీస్ కానిస్టేబుళ్లు రామస్వామి, రాజు నాయక్, సంపత్‌లను జిల్లా ఎస్పీ ఎం. రాజేశ్ చంద్ర అభినందించారు. కేసు దర్యాప్తులో వారి ప్రతిభ, అంకితభావాన్ని ప్రశంసించారు. హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు శాఖకు అనసూయ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి రైతు నేస్తం కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి : రైతు నేస్తం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు. కూరగాయల సాగును ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు కామారెడ్డి జిల్లాలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ, సమగ్ర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలంలో వర్షపాతం లోటు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 72 రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో సుమారు 5,000 మంది రైతులు, 200 మంది ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని పంటల సాగు, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై చర్చించినట్లు తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గిన నేపథ్యంలో నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు, జొన్న, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను నేల స్వభావం, స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ప్రణాళిక బద్ద మరియు సమగ్ర వ్యవసాయంతో అదనపు ఆదాయం పొందుతూ,పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణతో రైతులు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని రైతు శ్రీకాంత్ తన అనుభవంతో నిరూపిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మూడు ఎకరాల భూమిలో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పలు రకాల పంటలను సాగు చేస్తూ, రసాయన ఎరువులు, యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ఆయన చర్యలు చేపడుతున్నారని తెలిపారు.వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, నేల సారాన్ని పెంచేందుకు పెసర్లను పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగిస్తున్నారు. వరి పొలంలో పెంపకం ద్వారా యూరియా అవసరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించేందుకు పందిరి విధానాన్ని అనుసరిస్తూ, అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. అర ఎకరంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మొదటి ఏడాది రూ.1.50 లక్షలు, రెండో ఏడాది రూ.3 లక్షలు, మూడో ఏడాది నుంచి సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు ఈ సందర్భంగా రైతు శ్రీకాంత్ వెల్లడించారు. పంటల వైవిధ్యం, సహజ వనరుల సంరక్షణ, సమగ్ర వ్యవసాయ విధానాలు రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుస్తాయని కలెక్టర్ తెలిపారు. పామాయిల్తో పాటు అంతర పంటల సాగుతో అదనపు లాభాలు పామాయిల్ సాగుతో పాటు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్న గాంధారి మండలం గుడిమెట్ గ్రామ రైతు అనుభవం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో తన 15 ఎకరాల భూమిలో సోయాబీన్, మొక్కజొన్న, వరి పంటలను సాగు చేసిన సదరు రైతు, వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ 2023 జూన్లో పామాయిల్ సాగు ప్రారంభించారు. పామాయిల్ తోటలో మొదటి ఏడాది పత్తి, మునగ; రెండో ఏడాది మునగ, కంది పంటలను అంతర పంటలుగా సాగు చేశారు. ప్రస్తుతం మూడో ఏడాది ఉద్యానవన శాఖ ద్వారా పొందిన బంతిపూల మొక్కలతో సాగు చేపట్టారు. పామాయిల్తో పాటు అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నట్లు రైతు తెలిపారు. మొదటి కోతలో మూడు క్వింటాళ్ల వరకు పామాయిల్ దిగుబడి వచ్చిందని, పంట విక్రయించిన మూడు నుంచి నాలుగు రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ కావడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. నీటి వసతి తగ్గిన నేపథ్యంలో గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరిని ప్రస్తుతం ఇంటి సమీపంలోని ఒక ఎకరానికే పరిమితం చేసినట్లు తెలిపారు. రానున్న యాసంగి సీజన్లో ఆ ఎకరంలో కూడా వరికి బదులుగా మునగ సాగు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ఎంపికలో తగిన మార్పులు చేసుకోవాలని, పామాయిల్ వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అనువైన అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీమాయాల లక్ష్మి , కామారెడ్డి ఏఎంసీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి, రైతులు , ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అందుబాటులో ఉన్న సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి, తహసిల్దార్ హిమబిందు, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించిన నల్లమోతు సిద్ధార్థ.

మిర్యాలగూడ. (ది క్రైమ్ న్యూస్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ అవగాహన కల్పించారు. మిర్యాలగూడ పట్టణంలోని 25వ వార్డు సంతోష్ నగర్‌లో ఉన్న కేవీఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు.
ఈ సందర్భంగా నల్లమోతు సిద్ధార్థ మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, ఇతర పట్టభద్రులకు సైతం అవగాహన కల్పించి నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పందిరి వేణు, అల్లుబెల్లి వెంకట్, రామకృష్ణ, వినోద్, రామావతారం, మనీదీప్, బాచి, కరుణ, జ్యోత్స్న, కవిత, పద్మశ్రీ, బేగం తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు!

నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు..

చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన

మేడ్చల్, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్): మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎండీఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. లేఅవుట్‌లో అనుమతులకు అనుగుణంగా కాకుండా ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. భవన నిర్మాణాల్లో నిబంధనల ప్రకారం పాటించాల్సిన దూరాలను (సెట్‌బ్యాక్‌లు) విస్మరిస్తున్నారని, కొన్ని చోట్ల స్టిల్ట్ ప్లస్ మూడు అంతస్తులతో పాటు వాణిజ్య దుకాణాల కోసం షట్టర్లు ఏర్పాటు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని పక్క ప్లాట్ల యజమానులు ప్రశ్నిస్తే, తమ స్థలంలో తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేసుకుంటామని చెబుతూ వాగ్వాదాలకు దిగుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీలో సమస్యలు తలెత్తుతున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యపై సుమారు 30 రోజుల క్రితం ప్రజావాణి కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. హెచ్ఎండీఏ లేఅవుట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరినా, ఇప్పటివరకు పట్టణ ప్రణాళిక విభాగం నుంచి స్పందన లేదని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించాలని, అనుమతులు మరియు భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షణ చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ మేరకు హెచ్ఎండీఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎంపల్లి పద్మా రెడ్డి, కార్యదర్శి ఈదునూరి హేమంత్ కుమార్, కార్యవర్గ సభ్యులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి బొంతు శ్రీదేవి చొరవ

మేడ్చల్, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్): కాప్రా సర్కిల్, చర్లపల్లి సెక్షన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా, భూగర్భ మురుగునీటి పారుదల పనులను దసరా తర్వాత ప్రారంభించనున్నట్లు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ప్రాంతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పంకజ హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం మాజీ కార్పొరేటర్లు స్వర్ణరాజ్, పావని రెడ్డితో కలిసి ఈడీ ఎస్.పంకజ, సీజీఎం సంతోష్‌ను కలిసి పెండింగ్ పనులపై వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ నిధులతో చేపట్టనున్న పనుల్లో భాగంగా చక్రిపురంలోని ఐరన్ షాపు ఎదురుగా ఉన్న 200 ఎంఎం మురుగునీటి పైపులైన్‌ను 300 ఎంఎం పైపులైన్‌తో మార్చనున్నారు. కుషాయిగూడలోని వాసవి శివనగర్, పద్మశాలి టౌన్‌షిప్ సమీపంలో 100 ఎంఎం డీఐ తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో నీటి సరఫరా మెరుగుదలకు 200 ఎంఎం డీఐ పైపులైన్ నిర్మించనున్నారు. చర్లపల్లి రోడ్డులోని 5, 6 నంబర్ల రోడ్లపై దెబ్బతిన్న 200 ఎంఎం మురుగునీటి పైపులైన్‌ను మార్చడంతోపాటు మీనాక్షి నగర్‌లోని సాయి సింధు పాఠశాల సమీపంలో 300 ఎంఎం పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. కుషాయిగూడ రిషిక హాస్టల్ లేన్‌లో దెబ్బతిన్న 200 ఎంఎం పైపులైన్‌ను 250 ఎంఎం పైపులైన్‌తో మార్చనున్నారు. వీటితోపాటు శుభోదయ నగర్, కృష్ణారెడ్డి నగర్, మీనాక్షి నగర్, సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌తో పాటు కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న భూగర్భ మురుగునీటి పారుదల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పెండింగ్ పనులపై స్పందించి, వాటి ప్రారంభానికి హామీ ఇచ్చిన ఈడీ ఎస్.పంకజకు బొంతు శ్రీదేవి యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మీర్పేట్ హెచ్‌డీ కాలనీలో ఈవీ తేజ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూం ప్రారంభం

- షోరూంను ప్రారంభించిన ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్

మేడ్చల్ , అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్): మీర్పేట్ హెచ్‌డీ కాలనీలోని ఎన్ఎఫ్‌సీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీ తేజ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూంను ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నరేందర్ రావు, కొత్త రామారావు, లింగారెడ్డి, ఏఎస్ఐ నర్సింహులు పాల్గొన్నారు. షోరూం యజమాని కర్లపూడి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి అతిథులకు స్వాగతం పలికారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా తొలి వినియోగదారుడిగా సురేష్ కుమార్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేయగా, రెండో వినియోగదారురాలిగా లక్ష్మి స్కూటర్‌ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా తొలి వినియోగదారుడికి షోరూం యాజమాన్యం అభినందనలు తెలిపింది. అనంతరం షోరూం యజమాని కర్లపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ వద్ద కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ స్కూటర్లకు రెండేళ్ల వారంటీ అందిస్తున్నట్లు తెలిపారు. వాహనాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత త్వరగా, ఒక రోజులోనే మరమ్మతులు పూర్తి చేసి వాహనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బ్యాటరీ సాంకేతికతకు సంబంధించి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, నాణ్యమైన

వాహనాలను అందించడంతో పాటు కొనుగోలు అనంతరం కూడా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఎలక్ట్రిక్ స్కూటర్లలో వినియోగించే ఎల్ఎఫ్‌పీ బ్యాటరీలు మెరుగైన ఉష్ణ స్థిరత్వం, భద్రత, దీర్ఘకాలిక మన్నిక, తక్కువ నిర్వహణ ఖర్చు వంటి ప్రత్యేకతలను కలిగి ఉంటాయని తెలిపారు. వినియోగం, నిర్వహణ పరిస్థితులను బట్టి ఈ బ్యాటరీలు సుమారు 2,000 నుంచి 3,000 ఛార్జింగ్ సైకిళ్ల వరకు పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని వివరించారు. తయారీదారు సూచించిన ఉష్ణోగ్రత పరిధిలో వినియోగిస్తే మెరుగైన పనితీరు పొందవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మీర్పేట్ హెచ్‌డీ కాలనీలో ఈవీ తేజ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూం ప్రారంభం కావడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు స్కూటర్ల కొనుగోలు, సర్వీసింగ్ సదుపాయాలు మరింత అందుబాటులోకి రానున్నాయి.

దేశ రక్షణతో పాటు సామాజిక సేవలోనూ సైనికుడు ప్రకాశ్

సరిహద్దుల్లో దేశ రక్షణ ఆపదలో ఉన్నవారికి రక్తదానం ద్వారా ప్రాణరక్షణ

కామారెడ్డి జిల్లా ముద్దుబిడ్డ సైనికుడు ప్రకాశ్

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా వాసి దేశ రక్షణ కోసం చైనా సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న మన కామారెడ్డి జిల్లా ముద్దుబిడ్డ, సైనికుడు ప్రకాశ్ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. అస్సాం ప్రాంతంలో ఓ ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరిన గర్భిణీ మహిళకు అత్యవసరంగా ఒ నెగటివ్ (ఒ నెగటివ్) రక్తం అవసరమైంది. ఆ ప్రాంతంలో అరుదుగా లభించే ఈ రక్తగ్రూప్ కోసం రక్తదాన శిబిరం నిర్వాహకులు మన ప్రకాశ్ సంప్రదించగా, విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి అధికారుల అనుమతితో ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. పూర్వము కూడా కామారెడ్డిలో ఎన్నోసార్లు పెద్దదానం చేయడం జరిగింది దేశ సరిహద్దుల్లో శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే బాధ్యతను నిర్వహిస్తూనే, మరోవైపు ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం నిజంగా ఎంతో గర్వించదగిన విషయం. దేశభక్తి అంటే కేవలం దేశాన్ని రక్షించడమే కాదు... ఆపదలో ఉన్న మనిషి ప్రాణాన్ని కాపాడటం కూడా ప్రకాశ్ సేవ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. కామారెడ్డి జిల్లా బిడ్డలు ఎక్కడ ఉన్నా, తమ సేవా గుణంతో జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారనడానికి ఈ సంఘటనే నిదర్శనం. రక్తదానం ద్వారా మానవత్వపు విలువలను చాటిచెప్పు. దేశ రక్షణలో నిత్యం నిమగ్నమై ఉంటూ, సమాజ సేవలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న సైనికుడు ప్రకాశ్ ని జిల్లా రక్తదాతల సేవా సమితి. నిర్వాహకులు భోనగిరి శివకుమార్ , ముదాం శ్రీధర్ పటేల్ హృదయపూర్వకంగా అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం

కార్మికుల ఐక్యశక్తికి నిదర్శనమన్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్.జీ-త్రీ ఏరియాలో విజయోచ్చావా ర్యాలీ

ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు

రామగిరి, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్): -ప్రలోభాలకు లొంగకుండా తమ హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘానికే ఆర్టీసీ ఉద్యోగులు పట్టం కట్టారని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఐఎన్టీయూసీ కార్మిక సంఘం సహా ప్రత్యర్థి సంఘాలను ఎదుర్కొని ఏఐటీయూసీ ఈ విజయం సాధించడం కార్మికుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఆర్.జీ-త్రీ ఏరియాలో విజయోచ్చావా ర్యాలీ సభ నిర్వహించడం జరిగింది. ఈనెల 9వ తేదీన జరిగిన ఆర్టీసీ ఎన్నికలల్లో ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించడం జరిగిందని ఈ సందర్భంగా కార్మికులకు స్వీట్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు , బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండరీ క్రాంతి , బ్రాంచ్ సెక్రెటరీ ఏమ్ఆర్సీ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ డీటీ రావు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టే పోరాటాలకు ఏఐటీయూసీ సింగరేణి విభాగం సంఘీభావ మద్దతుతో పాటు అవసరమైన ఆర్థిక, హార్దిక సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. గతంలో ఉన్న పాలకులు ఆర్టీసీ కార్మికులను పట్టించుకోలేదని ఆర్టీసీలో ఉన్న యూనియన్లను ఎత్తివేసి వారి హక్కులను కాలరాసిందని అన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను మర్చిపోయి పాలన కొనసాగిస్తున్న తరుణంలో కార్మిక వర్గాన్ని ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీ కార్మిక వర్గం కోసం నిరంతరం హక్కులపై ఆర్టీసీ సంస్థ కాపాడుటకు కోసం పోరాటాలు చేస్తున్న క్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభ పక్ష నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపి ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వంతో చర్చించి ఎన్నికలు జరిపించిన సందర్భంలో 11 రీజియన్ లో ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఘన విజయం సాధించిందని అన్నారు. ఇదే ఐక్యతను సింగరేణిలో కూడా కొనసాగించాలని కార్మిక హక్కులను కాలరాస్తున్న ఈ పాలక ప్రభుత్వాలపైన కార్మిక క్షేత్రంలో పోరాటాలను ఉధృతం చేయాలని భవిష్యత్తులో జరిగే పోరాటంలో సింగరేణి కార్మికులు ముందంజలో ఉండి మీ సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.జీ-త్రీ ఏరియాలోని ఏఎల్ పి పిట్ సెక్రటరీ గంగాధర్, ఓసీపీ-వన్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కే. మల్లేష్ ,నక్క రమేష్, సీహెచ్ పి పిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్ , ఓసీపీ-టూ పిట్ సెక్రటరీ ఏమ్ సురేష్,ఎస్ ఓపీసీ , అన్ని గనులు డిపార్ట్మెంట్ లోని అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, షిఫ్ట్ సెక్రటరీలు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, సేఫ్టీ కమిటీ , మైన్స్ కమిటీ , టెంపుల్ కమిటీ , క్యాంటీన్ కమిటీ, యూనియన్ డెలిగేట్స్, యూనియన్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఖాళీ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డయల్ 112కు సమాచారం ఇవ్వాలి.. కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్

మేడ్చల్, అక్టోబర్ 11(ది క్రైమ్ న్యూస్): దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ సూచించారు. పండుగ సెలవుల్లో ఇంటి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రయాణానికి వెళ్లే ముందు ఇంటి తలుపులకు బలమైన తాళాలు వేయాలని, కిటికీలను పూర్తిగా మూసివేయాలని సూచించారు. ఇంటి ముందు వార్తాపత్రికలు, పాల ప్యాకెట్లు పేరుకుపోకుండా వాటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. అవి పేరుకుపోవడం ద్వారా ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు సులభంగా తెలిసే అవకాశం ఉందన్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయాలని, అవసరమైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఎక్కువ మొత్తంలో ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ వివరాలను, ఇంట్లో ఎవరూ ఉండరనే సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని తెలిపారు. కాలనీలు, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, తాళాలు వేసిన ఇళ్ల వద్ద అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని బిక్కి రమేష్ కోరారు. ప్రజలు తమ పరిసరాల్లోని ఇళ్లపై కూడా నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. దసరా పండుగను ప్రజలంతా ఆనందంగా, ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని, ఇళ్ల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ దొంగతనాల నివారణలో పోలీసు శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ విజ్ఞప్తి చేశారు.

రైతు సమస్యలపై ధ్వజమెత్తిన టిఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ పట్టణ కేంద్రంలో బి ఆర్ ఎస్ కార్యాలయం బి.ఆర్.ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో రైతులకు సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కరువు వస్తే నిజాంసాగర్ పరిరక్షణ సమితి పేరుతో కార్యక్రమాలు చేపట్టామన్నారు. అదే సమయంలో సింగూరు నీటి ద్వారా నిజాంసాగర్ ను పరిరక్షిస్తామని అన్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో పోచారం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కెసిఆర్ పాలనలో ఇదే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాళేశ్వరం ద్వారా కొండపోచమ్మ మల్లన్న సాగర్ నుండి తెలంగాణకు నీళ్లు ఇస్తామన్న పోచారం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదనీ ప్రశ్నించారు. ప్రస్తుతం బాన్స్వాడ వర్ని ప్రాంతాల్లో పండుతున్న వరి పంటను కొనేందుకు వేరే ప్రాంతాల నుండి వ్యాపారులు ఎక్కువ ధరలో కొనుగోలు చేస్తుంటే స్థానిక నాయకులు, దళారులు అడ్డుకుంటున్నారనీ, రైతులు ధర ఎక్కువ కు అమ్ముకుంటుంటే చూసి ఓర్వలేక ఎక్కువ ధర పెట్టి కొంటున్న వ్యాపారులకు బెదిరింపులకు గురి చేస్తున్నారని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులనుఆదుకోవాలనిఅన్నారు. నిజాంసాగర్ లోని నీరు ప్రస్తుతం ఇంకో పంటకు సరిపోయేంతగా ఉన్నాయని రెండు, నాలుగు టీఎంసీల నీరు ఉన్నప్పుడు సరిపోయిన నీళ్లు 10 టీఎంసీల నీళ్లు ఉంటే ఎందుకు సరిపోవు అని ఆయన ప్రశ్నించారు. నిజాంసాగర్ నీటిని పంట పండించేందుకు ఏఏ సమయాల్లో వదులుతారు అనేది విషయం స్పష్టంగా చెప్తే రైతులు రబీ పంటకు సిద్ధమవుతారని ఆయన అన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

సమాచార హక్కుపై అవగాహన.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు

-నాగేపల్లి గ్రామంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం

రామగిరి, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్):- సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్ట సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పాండ్రాల రాజు అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, సిబ్బందిని సన్మానించారు. సమాచార హక్కు చట్ట సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పాండ్రాల రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్, ఉప సర్పంచ్ యాసం సతీష్, పంచాయతీ కార్యదర్శి పాదం స్వప్న, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్త తులసిని శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ యాసం సతీష్ మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం ప్రతి సామాన్యుడు వారికి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఏ వ్యక్తి కూడా గోప్యత కలిగిన అంశాలను అడగరాదని వివరించారు. విద్యార్థినులు ఏ సమస్యలు వచ్చినా తమను సంప్రదించవచ్చన్నారు. సమాజంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించడం, ప్రజలకు తమ హక్కుల గురించి తెలియజేయడం, పారదర్శకతను ప్రోత్సహించడం లక్ష్యంగా కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాసేవలో భాగస్వాములవుతున్న గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, సిబ్బందిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తోగరి సురేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొమురోజు సురేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేగోలపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కాశిపేట శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు యాసం శ్రావణ్, ఆర్ల సనిల్, జిల్లా కార్యదర్శి బూడిద అనిల్, జిల్లా కో-కన్వీనర్ మిట్ట సాయి పాల్గొన్నారు. మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామడుగు శ్రీనివాస్, ఇన్‌చార్జ్ సాయి చరణ్, ఉపాధ్యక్షుడు బూడిద రాజు, రామగుండం డివిజన్ ఉపాధ్యక్షుడు పెద్దపల్లి రామచందర్, మంథని డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎల్పుల సామ్రాట్ తదితరులు హాజరయ్యారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం.. ప్రజల నుంచి 88 దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్, అక్టోబరు 12(ది క్రైమ్ న్యూస్) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల వినతులకు ప్రాధాన్యం ఇచ్చి వేగంగా పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

సమస్యలను స్వయంగా పరిశీలించిన రామగుండం సీపీ

పోలీస్ అధికారులకు కీలక సూచనలు

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టబద్ధంగా పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఇందులో భాగంగా సోమవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో గౌరవప్రదంగా మెలగాలని, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఓపికగా విని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు సాయికుమార్...

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్):- ఎలాంటి స్వార్థం లేకుండా పేద ప్రజలకు సేవలు అందించిన సాయికుమార్ నిస్వార్థ సేవకుడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బియ్యని సాయి కుమార్ జయంతి సందర్భంగా వారి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యుడిగా గ్రామంలోని పేదలకు మంచి వైద్య సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. ఈ కాలంలో ఏ వృత్తిలోనైనా డబ్బునే ఆశిస్తారని, కానీ సాయికుమార్ అలా కాకుండా తనవంతు సేవలు అందించి అందరి మనసులో చోటు సంపాదించుకుని ఆదర్శంగా నిలిచాడని అన్నారు. సాయి కుమార్ సేవలు మరువలేనివని, ఆయన ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సాయికుమార్ చిరస్థాయిగా నిలిచిపోయేలా విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన లేని లోటు తీరనిదని, ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు...

అతడి నిర్ణయమే ఫైనల్..

పెళ్లి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన మమితా బైజు

ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది మలయాళ భామ మమితా బైజు. ఇటీవలే సూర్యతో నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీతోపాటు బెత్లెహామ్ కుటుంబ యూనిట్ సినిమాలతో మంచి హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాను ఎవరిని పెళ్లి చేసుకుంటాననే విషయంతోపాటు తన జీవితంలోని ప్రతీ స్టెప్‌ను తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని చెప్పింది మమితా బైజు. నేను, నా సోదరుడు మిథున్ బైజు స్నేహితుల కంటే ఎక్కువ. నాకు సంబంధించి ప్రతీ నిర్ణయం మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలో కూడా మిథున్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్ ను హ్యాండిల్ చేసేది కూడా అతడే.. అంటూ కామెంట్ సెక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మమితా బైజు ఏంటీ..? అని రాసి ఉన్న డైలామాతో కూడిన మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చ్ట?స్తూ తన పెళ్లిపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టింది.

నెట్టింట పాపులర్.. మన సీత

హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి అందరికీ తెలిసిందే. తన అందం, అభినయంతో ఈ ముద్దుగుమ్మ.. స్పెషల్ ఫ్యాన్ బేస్ ను సంపాదించుకుంది. 2018లో 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగు పెట్టి.. ఆ తర్వాత 'తుఫాన్', 'ధమాక', 'జెర్సీ' సినిమాల్లో నటించింది. అదే సమయంలో దుల్కర్ సల్మాన్‌తో 'సీతారామం' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ- ఇచ్చి.. సీతాగా అందరి మనసులు దోచేసింది. తన వింటేజ్ లుక్, మెస్మరైజింగ్ యాక్టింగ్ తో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన న్యూస్ ఒకటి వైరల్ అవుతుంది..సోషల్ మీడియాలో మోస్ట్ పాపులర్ యాక్ట్రెస్‌గా నిలిచింది మన సీత. నెట్టింట ఆమె కోసమే ఎక్కువగా మాట్లాడుకున్నారట. ఎందుకంటే ఆమెకు సంబంధించిన పిక్స్ ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. సినిమాలతో బిజీగా ఉన్నా.. నెట్టింట ఎప్పటికప్పుడు కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటుంది మృణాల్. హీట్ పుట్టించే ఫొటోలతో పాటు- స్పైసీ క్లిక్స్ ను పోస్ట్ చేస్తుంటుంది. ఆమె క్యాప్షన్ కూడా క్రేజీ ఉంటాయి. దీంతో అమ్మడు పోస్టులు ఎప్పుడు ట్రెండింగ్ లోనే ఉంటాయి. మొత్తానికి ఆమె ఇప్పుడు నెట్టింట మోస్ట్ పాపులర్ నటి అనే అరుదైన ఘనత సాధించింది.

సాహిబా ప్రేమలో మునిగితేలుతున్న విజయ్

అగ్ర హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన 'సాహిబా' పేరుతో హిందీ మ్యూజిక్ ఆల్బమ్‌లో నటించారు. 'హీరియే..' గీతంతో పాపులర్ అయిన స్వరకర్త, గాయని జస్లీన్ రాయల్ ఈ పాటను కంపోజ్ చేయడం విశేషం. ఈ గీతంలో విజయ్ దేవరకొండకు జోడీగా రాధిక మదన్ నటించారు. సుధాంశు సరియా దర్శకత్వం వహించారు. శుక్రవారం ఈ ఆల్బమ్‌ను విడుదల చేశారు. వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో మెలోడీ ప్రధానంగా ప్రేమలోని సున్నిత భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ఇందులో విజయ్ దేవరకొండ ఫొటోగ్రాఫర్‌గా కనిపించారు. 'హీరియే..' గీతం తరహాలోనే 'సాహిబా' సైతం సంగీత ప్రపంచంలో సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని మ్యూజిక్ డైరెక్టర్ జస్లీన్ రాయల్ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవలే కేరళలో ఓ షెడ్యూల్ జరిగింది. ఈ సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో పీరియాడిక్ చిత్రంలో నటిస్తున్నారు విజయ్ దేవరకొండ.

కెరీర్ ఈ స్థాయిలో ఉందంటే అదృష్టమే: అవికా గోర్

యంగ్ హీరోయిన్ అవికా గోర్ గురించి పరిచయం అక్కర్లేదు. చిన్నారి పెళ్లికూతురు సిరియల్లో బాలనటిగా ఎంట్రీ- ఇచ్చి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. తర్వాత హీరోయిన్‌గా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'ఉయ్యాల జంపాల' చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమైన అవికా గోర్.. అనంతరం వరుస సినిమాలు తీసినప్పటికి, హీరోయిన్‌గా బారీ స్టార్ డమ్ మాత్రం అందుకోలేకపోయింది. అయనప్పటకి ఈ అమ్మడు ఫలితం ఆశించకుండా లైన్ గా సినిమాలు సిరీస్‌లు తీస్తునే ఉంది. అయితే ఇటీవల ఓ అవార్డ్ ఫంగ్షన్‌లో మాట్లాడిన అవికా కాస్త ఎమోషనల్ కామెంట్స్ చేసింది.. 'బాలికా వధు'తో మొదలైన నా కెరీర్ ఈ స్థాయికి ఎదగడం నిజంగా నా అదృష్టం. ప్రేక్షకులు ఈ రోజు నాకు ఈ స్థాయినిచ్చిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు. అధికారిక శిక్షణ లేదా చిత్ర పరిశ్రమ నేపథ్యం లేకుండానే ఈ స్టెజ్‌లో ఉన్నాను. కనీసం నాకు ఇంటి నుంచి కూడా సరైన మద్ధతు లేదు. అయినా నటిగా ఒక స్థాయికి ఎదిగినందుకు ఆనందంగా ఉంది. మంచి పాత్రలు వచ్చినప్పుడు బాధ్యతగా నటించి విజయం అందుకునేలా చేయడం ఆర్టిస్టు బాధ్యత. టె-లివిజన్ లేదా సినిమా ఏదైనా సరే నేను ఒకే విధంగా పని చేస్తాను. నేను దానిని తేలికగా తీసుకోలేను. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని ఒడిదుడుకులను అధిగమించి అనుకున్న స్థాయికి చేరతానని తెలిపింది అవికా.

నీ ప్రేమ నిరంతర ప్రయాణం

విఘ్నేష్‌కు విషెస్ చెప్పిన నయనతార

కోలీవుడ్ రొమాంటిక్ కపుల్స్‌లో లేడీ సూపర్ స్టార్ నయనతార, దర్శకుడు విఘ్నేశ్ శివన్ జంట ఒకటి. సుమారు ఏడేండ్ల పాటు- ప్రేమించుకున్న వారు పెద్దల అంగీకారంతో వివాహ బంధంతో ఒకటయ్యారు. పెళ్ళైన 4 నెలలకే సరోగసి పద్ధతి ద్వారా నయన్, విఘ్నేశ్ శివన్ దంపతులు కవల పిల్లలకు తల్లిదండ్రుల య్యారు. ఇక నేడు ఈ జంట మూడో పెళ్లిరోజు. ఈ సందర్భంగా విఘ్నేశ్ శివన్‌కు నయన్ సోషల్ మీడియా ద్వారా స్పెషల్‌గా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపింది. విఘ్నేశ్‌పై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ.. క్యూట్ ఫొటోలను కూడా పంచుకుంది..ఒకరిపై ఒకరు అంతగా ఎలా ప్రేమ చూపుతారే? ఇది ఎప్పటికీ సమాధానం దొరకని ఆశ్చర్యపరిచే విషయం. కానీ.. నీ రూపంలో దానికి నాకు సమాధానం దొరికింది. నీ ప్రేమను వర్ణించడానికి నాకు మాటలు చాలవు. నా మనసు కోరుకునే ప్రేమవు నువ్వు. ఇద్దరిగా ప్రారంభమైన మన ప్రయాణం నలుగురుగా మారింది. ఇంతకు మించి కోరుకోవడానికి ఏముంది. స్వచ్ఛమైన ప్రేమ ఎలా ఉంటుందో నువ్వు నాకు చూపించావు. నా జీవిత భాగస్వామికి పెళ్లి రోజు శుభాకాంక్షలు' అంటూ నయనతార శుభాకాంక్షలు తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అవి చూసిన నెటిజన్లు నయన్-విఘ్నేశ్ జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు.

రాజమౌళి మూవీలో విలన్ పాత్ర

సున్నితంగా తిరస్కరించిన విక్రమ్

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌లో రాజమౌళి- మహేశ్ ప్రాజెక్ట్ ఒకటి. భారీ స్థాయిలో రూపొందిస్తున్న ఈ మూవీలో అగ్ర తారలు ఇందులో భాగం కానున్నారు. అయితే తాజాగా ఓ వార్త వైరల్ అవుతుంది. ఏంటంటే.. తమిళ స్టార్ హీరో విక్రమ్ న్ను ఈ చిత్రంలో కీలకపాత్ర కోసం ఎంపిక చేయగా ఆయన ఈ ఆఫర్‌ను సున్నితంగా రిజెక్ట్ చేశారట. అది విలన్ పాత్ర కావడంతో ఆయన నో చెప్పారని సమాచారం. విక్రమ్ విలన్ రోల్ చేయకూడదని నిర్ణయించుకోవడంతో ఈ అవకాశాన్ని రిజెక్ట్ చేశారని టాక్. దీంతో ఈ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నట్లు- తెలుస్తోంది. ప్రజంట్ ఈ వార్త వైరల్ గా మారింది. ఇక ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతున్నప్పటికీ. ఇంతవరకు ఈ మూవీలోని ఒక్క పాత్రకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా.. ఇందులో ఆర్.మాధవన్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు- కూడా ఇటీ-వల టాక్ వినిపించింది. త్వరలోనే ఆయన సెట్స్ లోకి అడుగు పెట్టనున్నట్లు- ప్రచారం. ప్రజంట్ మాధవన్ కూడా డిఫరెంట్ కం-టె-ంట్‌ను ఎంచుకుంటు మంచి మంచి సినిమాలు సిరీస్‌లో నటిస్తూ ఫామ్ లోనే ఉన్నారు. కానీ దీని గురించి కూడా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

మణిరత్నంతో సినిమా చేయాలని ఉంది: అమిర్ ఖాన్

తరచు వార్తల్లో నిలిచే బాలీవుడ్ స్టార్ హీరోల్లో అమిర్ ఖాన్ ఒకరు. హింది తో పాటు తెలుగు, తమిళం భాషలోనే కాకుండా దక్షిణాదిలో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన. విభిన్న కథలు, విభిన్న పాత్రలతో ఆడియన్స్‌ని అలరిస్తూ ఉంటారు. ప్రస్తుతం 'సీతారే జమీన్ పర్ ' అనే చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రజంట్ ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వరుస ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా తాజాగా తమిళ దిగ్గజ దర్శకుడు మణిరత్నం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అమిర్ ఖాన్ మాట్లాడుతూ.. 'సౌత్‌లో నాకు మణిరత్నం సినిమాలు అంటే చాలా ఇష్టం. ఆయన మంచి విజనరీ. ఎలాంటి సినిమాలను అయినా చాలా బ్యాలెన్స్ చేయగలరు.. చెన్నై వెళ్ళినప్పు డల్లా ఆయనను కలుస్తుంటాను. ఎన్నో సార్లు మేమిద్దరం కలిసి పని చేయాలని అనుకున్నాం కానీ ఏదో ఒక అడ్డంకి వచ్చేది. ఓ సారి మా ఇద్దరి కాంబోలో 'లజో' అనే మూవీ కూడా అనుకున్నాం. కానీ, అనుకోని కారణాలతో అది చేయలేకపోయాం. కానీ ఎన్నటికైనా మణిరత్నం గారితో మూవీ చేయాలని ఉంది. అది భవిష్యత్‌లో నెరవేరుతుందనే ఆశ నాకుంది. ' అంటూ అమిర్ ఖాన్ మణిరత్నం గురించి క్రేజీ కామెంట్స్ చేశాడు. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com